Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి :1 సంచిక : 271 మేడ్చల్ మల్కాజ్‌గిరి 20 అక్టోబర్ 2023 శుక్రవారం పేజీలు : 4

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 4% డీఏ పెంపు

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మోదీ సర్కారు దసరా బొనాంజా ప్రకటించింది. ఉద్యోగుల కరువు భత్యాన్ని 4 శాతం పాయింట్లు పెంచుతూ ప్రధాని మోదీ నేతృత్వంలోని మంత్రి వర్గం నిర్ణయించింది. ఫలితంగా ప్రస్తుతమున్న 42 శాతం పాయింట్ల కరువు భత్యం 46 శాతం పాయింట్లకు పెరగనుంది. దీనిని ఈ ఏడాది జూలై 1 నుంచే లెక్కించి అమలు చేయనున్నారు. దీంతో 48.67 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 67.95 లక్షల మంది పింఛనుదారులకు లబ్ధి చేకూరనుంది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ మీడియాకు వివరించారు. 7వ సెంట్రల్ పే కమిషన్ సిఫారసుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. డీఏ పెంపుతో కేంద్ర ఖజానాపై ఏటా రూ.12,857 కోట్ల భారం పడనుందని వెల్లడించారు.



# ఇది ప్రజల తెలంగాణ కాదు..

# దొరల తెలంగాణ

## కేసీఆర్‌ది నియంత పాలన

### మంథని రోడ్‌షోలో కేసీఆర్ సర్కార్‌పై నిప్పులు చేరిగిన రాహుల్ గాంధీ

పెద్దపల్లి: ఇది ప్రజల తెలంగాణ కాదు, దొరల తెలంగాణ అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. గురువారం మంథనిలో రాహుల్ రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పుడు ప్రజల తెలంగాణకు, దొరల తెలంగాణకు మధ్య యుద్ధం జరుగుతోందన్నారు. ఈయన ముఖ్యమంత్రి కాదు, రాజులా వ్యవహరిస్తున్నారని.. కేసీఆర్ కుటుంబ సభ్యులకే న్యాయం జరుగుతోందన్నారు. ప్రజలకు, రైతులకు ఎలాంటి న్యాయం జరగడం లేదని విమర్శించారు.

లక్ష కొట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి ఒక్క ఎకరానికి నీరు ఇవ్వలేదని.. కానీ వారి కుటుంబానికి మాత్రం మేలు జరిగిందన్నారు. బీఆర్ఎస్ - బీజేపీ - ఎంఐఎం ఒక్కటే అని మూడు పార్టీలు కలిసి పని చేస్తున్నాయని వ్యాఖ్యలు చేశారు. దేశంలో అత్యంత అవినీతి ముఖ్యమంత్రి తెలంగాణలో ఉన్నారన్నారు. ఆయనపై బీజేపీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. రెండు పార్టీలు ఒక్కటే, బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు ఉందని తెలిపారు. అన్ని రాష్ట్రాల్లో ఎంఐఎం అభ్యర్థులను నిలబెట్టి బీజేపీకి సహకరిస్తోందన్నారు.

తాము ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నామన్నారు. నరేంద్ర మోదీ వద్ద కేసీఆర్ చేతులు కట్టుకుని ఉంటున్నారని.. బీజేపీపై ధైర్యంగా పోటీ చేస్తోంది కాంగ్రెస్ మాత్రమే అని చెప్పుకొచ్చారు. తనలో ప్రవహించే రక్తం కాంగ్రెస్ పార్టీ ది అని అన్నారు.

బీజేపీ, ఆర్ఎస్ఎస్ తనపై ఎంత కక్ష సాధిస్తే తనకు అంతమంచిదని తెలిపారు. "తెలంగాణ ప్రజలతో నాకున్నది రాజకీయ అనుబంధం కాదు కుటుంబ బంధం. నేను నిన్న నా సోదరి ప్రియాంకను తీసుకొచ్చా. మా నాయనమ్మ ఇందిరాతో తెలంగాణకు అనుబంధం ఉంది" అని ఆయన తెలిపారు.

**అబద్దాలు చెప్పేందుకు తెలంగాణకు రాలేదు..** "నరేంద్ర మోదీ ప్రతి కుటుంబానికి 15లక్షలు వేస్తా అన్నారు. జీఎస్టీతో పేద వారికి న్యాయం చేస్తానని మోసం చేశారు. కేసీఆర్ పేదలకు 3ఎకరాల భూమి ఇస్తానని మోసం చేశారు. నేను అబద్దాలు చెప్పేందుకు తెలంగాణకు రాలేదు. నేను అనుబంధంతో వచ్చాను. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి మహిళ ఖాతాలో నెలకు రూ. 2500 వేస్తాం. రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తాం. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం. తెలంగాణలో కాంగ్రెస్ గాలి వీస్తోంది. రాహుల్ గాంధీ అబద్ధం ఆడరు, నిజం తెలుసు కోవాలంటే కర్ణాటక వాళ్లను అడగండి. ఈ దేశం లో అన్ని వర్గాల ప్రజలున్నారు. దేశ సంపదలో వాటా ప్రతి ఒక్కరికి దక్కాలని కోరుతున్నాము. తెలంగాణలో సంపద ఏమవుతుందో తెలుసుకోండి. తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జనాభా లెక్కలు చెప్పడం లేదు. ఓబీసీ జనాభా ఎంతో చెప్పాలని పార్లమెంట్‌లో అడిగితే సమాధానం రాలేదు.

ఇవాళ దేశం మొత్తాన్ని 90 మంది అధికారులు నడిపిస్తున్నరు. తెలంగాణలో కూడా 70 మంది అధికారులు ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. సీఎం ఆదేశిస్తే ఆ అధికారులు అమలు చేస్తున్నారు" అంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేశారు.

## రూ. 80 వేల కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి ఎట్ల జరుగుతది..? రాహుల్‌ను ప్రశ్నించిన కేటీఆర్




హైదరాబాద్ : జవహర్ లాల్ నెహ్రూ బిడ్డ ఇందిరా గాంధీ కొడుకు రాజీవ్ గాంధీ భార్య సోనియా గాంధీ కొడుకు రాహుల్ గాంధీ వచ్చి.. తెలంగాణలో కుటుంబ పాలన గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన వికలాంగుల పెన్షన్ లబ్ధిదారుల కృతజ్ఞత సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. కేసీఆర్‌ది కుటుంబ పాలన అని అంటున్న రాహుల్ గాంధీ ఎవరు..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ ఒకే వేదిక మీద నిలబడొచ్చు. సోనియా గాంధీ అదే వేదిక మీద ఉండొచ్చు. అప్పుడప్పుడు చనిపోయిన ఇందిరా గాంధీని, రాజీవ్ గాంధీని, నెహ్రూని యాది చేసుకోవచ్చు. కానీ కేసీఆర్‌ది మాత్రం కుటుంబ పాలన అంటరు. ఇదెక్కడి నీతి నాకర్థం కాదు. గొంగడిలో కూర్చొని ఎవడన్న వెంట్రుకలు ఏరుతాడా..? అని కేటీఆర్ ప్రశ్నించారు.

**రాహుల్ గాంధీ లీడర్ కాదు.. రీడర్..** కేసీఆర్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని రాహుల్ మాట్లాడుతున్నారని కేటీఆర్ నిప్పులు చెరిగారు. కాళేశ్వరం ప్రాజెక్టును రూ. 80 వేల కోట్లతో నిర్మించారు. కానీ రాహుల్ గాంధీ లక్ష కోట్ల అవినీతి జరిగిందని అంటున్నడు. అమెరికాలో ఉండే ప్రపంచ పర్యావరణ కాంగ్రెస్ వాళ్లు పిలిచి కాళేశ్వరానికి అవార్డులు ఇస్తున్నారు. కానీ ఇక్కడున్న కాంగ్రెసోళ్లకు అయితే అర్థమైత లేదు. 80 వేల కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి ఎట్ల జరుగుతది. కొంచెం బుర్రతో ఆలోచించి మాట్లాడాలి. రాహుల్ గాంధీతో వచ్చిన బాధ ఏంటంటే.. ఆయన లీడర్ కాదు.. రీడర్. ఏం రాసిస్తే అది చదువుతాడు పాపం. ఆయనకేం తెల్వదు.. తెల్లకాగితం. తెలుసుకునే ప్రయత్నం కూడా చేయడు అని రాహుల్‌పై కేటీఆర్ మండిపడ్డారు.

**కాంగ్రెస్ పార్టీని బీజేపీకి తప్పక అమ్మేస్తడు..** కేసీఆర్ అవినీతి పరుడు అని రాహుల్ అంటున్నడు.. మరి రాహుల్ పక్కకు గజదొంగ రేవంత్ ఉన్నాడనే విషయాన్ని మరిచిపోవద్దని కేటీఆర్ సూచించారు. అంతకంటే పెద్ద గజదొంగ ఈ దేశంలో ఎవడైనా ఉన్నాడా..? ఆయన ముందు దావూద్ ఇబ్రహీం, చార్లెస్ శోభరాజు కూడా చిన్నోళ్లు. ఆనాడు ఓటుకు నోటు.. ఇప్పుడు సీటుకు రేటు. ఓటుకు నోటు.. సీటుకు రేటు.. రేపు రాష్ట్రమంతా అమ్ముతడు. బీజేపీకి కాంగ్రెస్ పార్టీని అమ్మిపారేస్తడు. అలాంటి వ్యక్తిని పక్కన కూర్చొబెట్టుకుని ఇవాళ రాహుల్ అవినీతి గురించి మాట్లాడుతున్నాడు. పీసీసీ అధ్యక్షుడే పైసలు పంచుకుంటూ దొరికిపోయిన దగుల్బాజీ. రూ. 50 కోట్లు మీ ఇంచార్జికి లంచం ఇచ్చి పీసీసీ అధ్యక్ష పదవి తెచ్చుకున్న దొంగ రేవంత్. ఇది వాస్తవమో కాదో తెలుసుకోవాలంటే.. మీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని పక్కకు పిలిచి అడిగినా చెప్తడు. ఇక్కడ సీట్లు ఎక్కడ అమ్ముతున్నడు. ఎక్కడ విల్లాలు రాయించుకుంటున్నడు. ఎక్కడ ప్లాట్లు రాయించుకుంటున్నడు. కొద్దిగా ఎంక్వైరీ చేయించుకో రాహుల్ గాంధీ. ఓ పది మంది కాంగ్రెస్ నాయకులను పక్కకు తీసుకెళ్లి మాట్లాడి వాస్తవాలు తెలుసుకో. నీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులను పిలిచి మాట్లాడు రేవంత్ బండారం బయటపడ్తది. దొంగను పక్కన కూర్చోబెట్టుకుని మాట్లాడుతుంటే.. గురివింద గింజ తన నలుపు ఎరుగదు అన్నట్లు ఉన్నది కథ అని కేటీఆర్ విమర్శించారు.

## ఎన్నికల నియమావళి అమలయ్యేలా చూడాలి

### ఈసీకి న్యాయవాదుల వినతి

దిల్లీ: తెలంగాణలో ఎన్నికల నిర్వహణపై కేంద్ర ఎన్నికల సంఘానికి పలువురు సుప్రీంకోర్టు న్యాయవాదులు విజ్ఞాపనలు అందజేశారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఆస్తులు, కేసులను ఈసీ పరిశీలించి.. అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల నియమావళి అమలు చేసేలా చూడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. 2018లో పోటీ చేసిన అభ్యర్థుల ఆదాయాలు ఐదేళ్లలో విపరీతంగా పెరిగాయని, వాటిని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. "అభ్యర్థుల గత అఫిడవిట్, తాజాగా సమర్పించే అఫిడవిట్లను పోల్చి చూడాలి. ఈ ఐదేళ్లలో ఆదాయం అక్రమ పద్ధతిలో పెరిగిందా? సరైన మార్గంలోనా అనే విషయాన్ని ఎన్నికలకు ముందే పరిశీలించాలి. చాలా మంది అభ్యర్థులు ఎన్నికల నియమావళిని పాటించడం లేదు. డబ్బు, మద్యం పంపిణీ చేయడం తెలంగాణలో బాగా పెరిగింది. తెలంగాణ ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రవాహాన్ని అరికట్టి ఓటర్లను ప్రభావితం చేయకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌కి ఉంది. ప్రస్తుత సమయంలో ఎన్నికల అధికారుల నిఘా చాలా కీలకం. ఓట్ల కోసం ప్రకటనలు చేసే పత్రికలు, టీవీల్లోనే క్రిమినల్ కేసులపై కూడా ప్రకటనలు ఇవ్వాలి. అభ్యర్థి ఆదాయ ధ్రువీకరణపై పూర్తి స్థాయి పరిశీలన చేయాలి.

ఎలాంటి క్రిమినల్ కేసులు లేని అభ్యర్థులను సరైన విధానంలో నిర్ధరించాలి. ఎన్నికల్లో నేరస్థులు పోటీ చేయకుండా చూడాలి. అభ్యర్థుల అఫిడవిట్‌ల పరిశీలన నిక్కచ్చిగా ఉండాలి.

గత ఎన్నికల సందర్భంగా జరిగిన అన్ని అంశాలను ఈ సారి ఎన్నికల్లో అనుభవ పాఠాలుగా చూడాలి. అభ్యర్థుల చట్టవిరుద్ధమైన చర్యలను ఎదుర్కోవాలి" అని ఎన్నికల కమిషన్‌ను కోరినట్టు సుప్రీంకోర్టు న్యాయవాది జగన్ తెలిపారు.

# బీఆర్ఎస్‌లో టికెట్ల కొట్లాట



## బీఆర్ ఎస్‌లో పొలిటికల్ భగభగలు.. పార్టీ నుంచి జంపింగులు!

## తారా స్థాయికి చేరిన అసంతృప్తి

హైదరాబాద్ : తెలంగాణ అధికార పార్టీకి కీలక ఎన్నికల ముందు భారీ షాకులు తగులుతున్నాయని అంటున్నారు పొలిటికల్ పరిశీలకులు. ఎన్నికల్లో విజయం దక్కించుకోవాలని పార్టీ గట్టిగా నిర్ణయించుకుని గెలుపు గుర్రాలకే టికెట్లు ప్రకటించినట్టు సీఎం కేసీఆర్ స్వయంగా ప్రకటించారు.

టికెట్లు రాని వారు.. బాధ పడొద్దని.. పార్టీని అధికారంలోకి తీసుకువస్తే.. పదవులు.. పీఠాలు వేరేవి కూడా వస్తాయని అనునయించారు. కానీ.. నాయకులు మాత్రం కేసీఆర్ మాటను లక్ష్య పెట్టినట్టు కనిపించడం లేదు. తాజాగా ఉమ్మడి నల్గొండ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ నుంచి జంపింగులు పెరిగాయి. పలు నియోజకవర్గాల్లో అసమ్మతి భగ్గుమంది. దీంతో కీలక నాయకులు పార్టీని వీడాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. ఈ క్రమంలో వారికి కాంగ్రెస్ ఆహ్వాన పత్రికలు పంపి.. రెడ్ కార్పెట్ పరుస్తామని స్వాగతిస్తోంది. కోడాడలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు, బీఆర్ఎస్ మాజీ ఇంచార్జ్ శశిధర్ రెడ్డి, డీసీసీబీ మాజీ ఛైర్మన్ ముత్తవరపు పాండురం గారావులు పార్టీ మారేందుకు రెడీ అయ్యారు. ఈ క్రమంలో కోదాడలో మాజీ పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డితో వీరు భేటీ కానున్నట్టు తెలిసింది. మరోవైపు కీలక నియోజకవర్గం నాగార్జునసాగర్ నియోజకవర్గంలో అసమ్మతి భగ్గుమంది. బీఆర్ఎస్ కు గుడ్ బై చెప్పనున్నట్టు గుర్రంపోడ్ జెడ్పీటీసీ గాలి రవి కుమార్ సహా 10 మంది సర్పంచ్ లు, 12మంది మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీ బహిరంగ ప్రకటన చేశారు. ఎమ్మెల్యే భరత్ ను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్టు చెప్పారు. అదేవిధంగా నల్గొండ మున్సిపాలిటీలోనూ బీఆర్ఎస్ పరిస్థితి ఇబ్బందిగా మారింది. తమకు ఎలాంటి గౌరవం లేకుండా పోయిందని ఆరోపిస్తూ.. మున్సిపల్ వైస్ చైర్మన్ సహా ఐదుగురు అధికార బీఆర్ఎస్ కౌన్సిలర్లు పార్టీ వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటున్నట్టు ప్రకటించారు. వీరంతా ఎంపీ కోమటిరెడ్డికి టచ్ లోకి వెళ్లినట్టు తెలిసింది. ఇదిలావుంటే, బోథ్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీకి గుడ్ బై చెప్పేందుకు సిద్ధమవుతున్నారు. రేవంత్ రెడ్డి నివాసానికి బోథ్ ఎమ్మెల్యే బాపురావు వెళ్లడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. బోథ్ సిట్టింగ్ ఎమ్మెల్యే బాపురావును బీఆర్ఎస్ అధిష్టానం పక్కనబెట్టేసి ఆ స్థానాన్ని అనిల్ జాదవ్‌కి కేటాయించింది. దీంతో ఆయన కేసీఆర్‌పై నిప్పులు చెరుగుతున్నారు. మరి దీనిపై కేసీఆర్ ఎలాంటి వ్యూహంతో ముందుకు సాగుతారో చూడాలి.

# సంపాదకీయం

## కాంగ్రెస్ లో తీర్మానాలు చెల్లవా?

ఒకప్పుడు దేశాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంతో ఏలిన కాంగ్రెస్ బీజేపీ దెబ్బకు కకావికలమైన సంగతి తెలిసిందే. వరుసగా రెండు సార్వత్రిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ కు ఎదురు దెబ్బ తగిలింది. కానీ ఇప్పుడు తిరిగి పుంజుకునే దశలో ఉన్న ఆ పార్టీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించింది. కర్ణాటకలో విజయంతో జోరుమీదున్న హస్తం పార్టీ.. తెలంగాణలో నూ ఊపు కొనసాగించాలని చూస్తోంది. అదే పట్టుదలతో సానుకూల పవనాలను అనుకూలంగా మార్చుకోవాలనే పట్టుదలతో సాగుతోంది. ఈ క్రమంలోనే 55 మందితో తొలి జాబితా ప్రకటించింది. అయితే ఇందులో ఉత్తమ్ కుమార్ రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు కుటుంబాలకు రెండేసి టికెట్లు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. తెలంగాణలో 2018 ఎన్నికల్లోనూ ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆయన భార్య పద్మావతి పోటీ చేశారు. హుజూర్ నగర్ నుంచి గెలిచిన ఉత్తమ్.. అనంతరం లోక్ సభ ఎన్నికల్లోనూ విజయం సాధించి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. కానీ కోదాడ నుంచి బరిలో దిగిన పద్మావతి ఓటమి పాలయ్యారు. ఈ సారి ఎన్నికల్లోనూ ఇద్దరికీ సీట్లు ఇవ్వాలని ఉత్తమ్ పట్టుబట్టారు. అధిష్ఠానం నిర్ణయం తీసుకోకముందే ఈ ఎన్నికల్లో తాను, భార్య పోటీ చేస్తామని ఉత్తమ్ ప్రకటించుకున్నారు. అంతే కాకుండా అభ్యర్థుల ఎంపిక కోసం స్క్రీనింగ్ కమిటీ నిర్వహించిన సమావేశాల్లోనూ రెండు టికెట్ల కోసం ఉత్తమ్ పట్టుబట్టడంతో గొడవ జరిగిన సంగతి తెలిసిందే. మరోవైపు తన తనయుడు రోహిత్ రావుకు మెదక్ టికెట్ డిమాండ్ చేస్తూ మైనంపల్లి హన్మంతరావు కాంగ్రెస్ లో చేరిపోయారు. మల్కాజిగిరి నుంచి తనకు, మెదక్ నుంచి తన కొడుక్కి టికెట్లు ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్ఠానాన్ని డిమాండ్ చేశారు. ఆ మేరకు హామీ ఇవ్వడంతోనే హస్తం పార్టీ కండువా కప్పుకున్నారు. ఇప్పుడు ప్రకటించిన జాబితాలో ఉత్తమ్, మైనంపల్లి కుటుంబాల్లో ఇద్దరికి టికెట్లు కేటాయించింది కాంగ్రెస్. అయితే ఉదయ్ పూర్ తీర్మానం ప్రకారం కుటుంబాలకు ఒకటే టికెట్ అని కాంగ్రెస్ చెబుతూ వస్తోంది. కానీ ఉత్తమ్, మైనంపల్లి విషయంలో మాత్రం ఈ తీర్మానాన్ని పట్టించుకోలేదని కాంగ్రెస్ వర్గాలే చెబుతున్నాయి. ఈ సారి ఎన్నికల్లో ఉత్తమ్ దంపతులు, మైనంపల్లి తండ్రీ కొడుకులు గెలిచే అవకాశాలు ఉన్నాయని అధిష్ఠానం నమ్మడమే అందుకు కారణమని అంటున్నారు.

# స్థలాలున్నా.. అద్దె భవనాల్లోనే!



కోరుట్ల : జిల్లాలోనే రెండవ పెద్ద పట్టణమైన కోరుట్ల నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేక ఏళ్ల తరబడి అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి.. పట్టణంలో ప్రభుత్వ స్థలాలు ఉన్నప్పటికి సొంత భవనాలు నిర్మించేందుకు నిధులు కేటాయించలేని పరిస్థితి నెలకొంది.. నిత్యం రద్దీగా ఉండే ప్రభుత్వ కార్యాలయాలు ఇరుకైన అద్దె భవనాల్లో కొనసాగడంతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమౌతోంది. నాలుగేళ్లుగా..వ్యవసాయశాఖకు శాశ్వత భవనం లేకపోవడంతో 2005లో మార్కెట్‌యార్డులోని దెబ్బతిన్న రైతు విశ్రాంతి భవనం కేటాయించడంతో అందులో కార్యాలయం ఏర్పాటు చేసుకుని అన్నదాతలకు సేవలందిస్తున్నారు. 2009లో గోదాం ఏరియాలోనున్న 80 గజాల స్థలం కేటాయించి 2011–12లో బీఆర్‌జీఎఫ్ కింద రూ.10 లక్షలు మంజూరు చేయడంతో సొంత భవనం నిర్మించారు. నిధులు సరిపోకపోవడంతో పనులు పూర్తిచేయకుండా వదిలేశారు. 2019లో రూ.3 లక్షలు కేటాయించడంతో పనులు పూర్తి చేశారు. నియోజకవర్గ కేంద్రంలోనే వ్యవసాయశాఖ డివిజన్ కార్యాయాలు (ఏడీఏ) ఏర్పాటు చేయాలని నాలుగేళ్ల కిందట ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. వ్యవసాయశాఖ భవనంలోకి ఏడీఏ కార్యాలయం తీసుకువస్తారని తెలపడంతో దానిని ప్రారంభించకుండా ఖాళీగా వదిలేశారు. ఆరు నెలల కిందట మార్కెట్‌యార్డులోని. 1.20 ఎకరాల విస్తీర్ణంలో రూ.4 కోట్లతో సమీకృత మార్కెట్ల నిర్మాణం చేపట్టడంతో పాత భవనాలను పూర్తిగా తొలగిస్తామని తెలపడంతో ఏవో కార్యాలయం ఖాళీచేసి అద్దె భవనంలో నామమాత్రంగా ఏర్పాటు చేశారు.

భవనం లాక్కుని.. గది కేటాయించారు..

కోరుట్ల పట్టణానికి 1971లో గ్రామీణ పశువైద్య కేంద్రం మంజూరు కాగా 1976లో పశువుల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. 1987లో వేములవాడరోడ్‌లో పశువైద్యశాలకు శాశ్వత భవనం నిర్మించారు. 2008లో ప్రభుత్వ ఆసుపత్రికి 30 పడకల నూతన భవనం నిర్మించేందుకు స్థలం సరిపోదంటూ అప్పటి ప్రజాప్రతినిధులు పశువైద్యశాఖ భవనం స్థలం అవసరం ఉంటుందని లాక్కున్నారు. దీంతో కల్లూర్‌రోడ్‌లో శిథిలావస్థకు చేరిన ఎస్సారెస్పీ క్వార్టర్‌లోకి పశువైద్యశాలను మార్చారు. క్వార్టర్‌ను ఖాళీ చేయాలంటూ ఎస్సారెస్పీశాఖ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేశారు. సొంత స్థలం కేటాయించాలని పలుమార్లు రెవెన్యూశాఖకు దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోలేదు. రెండేళ్ల కిందట ఎస్సారెస్పీ క్వార్టర్‌లను పూర్తిగా తొలగించడంతో పశువైద్యశాలను వేములవాడరోడ్‌లోని పాత ఆసుపత్రి భవనంలోకి మార్చారు. ఏడాది తర్వాత ప్రభుత్వ ఆసుపత్రికి 100 పడకల భవనం మంజూరు కాగా పాత పశువైద్యశాల భవనం పూర్తిగా తొలగించారు. ఏడాది కిందట పాతమున్సిపల్ భవనం పైఅంతస్తులో ఓగది ఇవ్వడంతో అసౌకర్యాల మధ్య పశువైద్యశాలను ఏర్పాటు చేశారు.

16 ఏళ్లుగా..కోరుట్లకు 2007లో రవాణాశాఖ ఉప కార్యాలయం మంజూరైంది. స్థానిక ఆదర్శనగర్‌లోని ఓ అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. 16 ఏళ్లుగా అద్దె భవనంలోనే కొనసాగుతుంది. ఈ రవాణా శాఖ పరిధిలోకి కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాలు వస్తుంటాయి. ఆరు మండలాలకు సేవలందించాల్సిన రవాణాశాఖ కార్యాలయం ఇరుకుగా ఉన్న అద్దె భవనంలో ఏర్పాటు చేయడంతో కనీస సౌకర్యాలు కరవయ్యాయి. వాహనాల సామర్థ్యం, టెస్ట్ డ్రైవింగ్ ట్రాక్ సౌకర్యం లేక ఆరుబయట ప్లాట్లలో ఏర్పాటు చేసి ఎండలో ఎంవీఐ, సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సొంత భవన నిర్మాణానికి మాదాపూర్‌రోడ్‌లో ప్రభుత్వ స్థలం కేటాయించి పనులు చేపట్టగా కోర్టు కేసు ఉండటంతో మధ్యలోనే వదిలేశారు. ఏడాది క్రితం రామారావుపల్లెరోడ్‌లో 2.20 ఎకరాల ప్రభుత్వ భూమిని రోడ్డు ఇరువైపులా కేటాయించారు. ఆస్థలం ట్రాక్ నిర్మించేందుకు అనువుగా లేదు. నిధులు కేటాయిచడంలో జాప్యం చేస్తున్నారు.

నెలకు రూ.50 వేలు..

కోరుట్ల పట్టణానికి 2014లో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరైంది. సి.ప్రభాకర్ స్మాకర గ్రంథాలయ పైఅంతస్తులో అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. ఈకోర్టు పరిధిలోకి కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి మండలాలు వస్తాయి. కోర్టుకు వచ్చిన కక్షిదారులు, న్యాయవాదులు, పోలీసులు ఉండేందుకు కనీస వసతులు లేకపోవడంతో ఏళ్ల తరబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరుబయట వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ కోసం ఇక్కట్లు పడ్డారు. రెండు నెలల కిందట పాత భవనానికి దగ్గర్లో నూతనంగా నిర్మించిన పెద్ద భవనంలోకి కోర్టును మార్చారు. నెలకు రూ.50వేల చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. కోరుట్ల కోర్టుకు శాశ్వత భవనం, న్యాయమూర్తి నివాస గృహం, ఇతర నిర్మాణాలు చేపట్టేందుకు 2016లో మెట్‌పల్లిరోడ్‌లో 2 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించారు. ఇప్పటివరకు ప్రభుత్వం నిధులను కేటాయించకపోవడంతో ఖాళీగా వదిలేశారు.

# పురాల్లో.. పానీపాట్లు

మెదక్ : కోట్లాది రూపాయలు వెచ్చించి తాగునీటి పథకాలను నిర్మించినా.. పురవాసులకు 'పానీ'పాట్లు తప్పడం లేదు. సరఫరాలో తరచూ అంతరాయం.. గతంలో వేసిన పైప్‌లైన్ల మీదుగా సీసీ రహదారులు, మురుగు కాలువలు నిర్మించడంతో లీకవుతున్నాయి. విద్యుత్తు సమస్య కారణంగా సరిగా పంపిణీ కావడం లేదు. అవసరమైన చోట మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుత వేసవిలో ప్రణాళికతో అడుగేస్తేనే ఇబ్బందులు ఉండవు. జిల్లాలోని నాలుగు పురపాలికల్లో తాగునీటి సమస్యపై పరిశీలన కథనం.మరమ్మతులు చేపట్టినా..

ప్రస్తుత పరిస్థితి: రూ.60 కోట్లతో జలజాలం పనులు చేపట్టగా, తరచూ ప్రధాన పైప్‌లైన్లు ధ్వంసమై నీళ్లు లీకవుతున్నాయి. దీంతో మరమ్మతులు చేపట్టినా యథాస్థితి నెలకొంటోంది. పట్టణంలోని వడ్డెర, దుర్గా కాలనీల్లో సమస్య తీవ్రంగా ఉంది. ట్యాంకర్లే దిక్కయ్యాయి. పిల్లికొట్టాలలోని రెండు పడక గదుల ఇళ్లను ప్రారంభించగా ట్యాంకు ద్వారా నీటిని అందిస్తున్నారు. ఇక్కడ ఉంటున్న 400 కుటుంబాలకు సరిపోవడం లేదు. రెండు సార్లు సరఫరా చేస్తే సరిపోతుంది. ట్యాంకర్లతో తాగునీటిని పంపిణీ చేస్తున్నారు. 18వ వార్డులో వెస్లీ పాఠశాల వద్ద, 6వ వార్డులో పలు ఇళ్లకు నీటి కనెక్షన్లు ఇవ్వలేదు. పట్టణంలోని అన్ని వార్డుల్లో పైపులైన్లు వేసి ఇళ్ల వరకు కనెక్షన్ ఇచ్చినా మీటర్లకు అనుసంధానం చేయలేదు. సరఫరాలో హెచ్చుతగ్గులతో లోపాలు ఎదురవుతున్నాయని మున్సిపల్ డీఈఈ మహేశ్ తెలిపారు. వెంటనే పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు.

మెదక్

70,000

12 ఎంఎల్‌డీ



12 ఎంఎల్‌డి

22 : 9,200

సాంకేతిక సమస్యలతో..

నర్సాపూర్ అంబేద్కర్ కాలనీలో భగీరథ నల్లా కనెక్షన్లు

ప్రస్తుత పరిస్థితి: పట్టణంలోని 15 వార్డుల్లో భగీరథ పథకంలో ఆరు ట్యాంకులు నిర్మించారు. 9వ వార్డులోని ఇటికెలొల్ల వాడ, 10వ వార్డులో మందులొల్ల బస్తీ, 13, 14, 5వ వార్డులలో నీటి సమస్యలు ఉన్నాయి. తపాలా కార్యాలయం వీధిలోని ట్యాంకు ద్వారా 13, 14 వార్డులకు పంపిణీ చేస్తున్నారు. 550 కనెక్షన్లకు 1,100 ఉండటం సమస్యగా మారింది. చక్రియాల ఇన్‌టేక్‌వెల్ వద్ద తరచూ సాంకేతిక, విద్యుత్తు సమస్యల కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మంజీరా సరఫరా నిలిచిన సమయంలో అవస్థలు పడాల్సిందే. సమస్య ఉన్న వార్డులకు మూడు ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నామని కమిషనర్ వెంకట్‌గోపాల్ తెలిపారు.

నర్సాపూర్

ఆదరబాదరాగా పైప్‌లైన్ పనులు..

ప్రస్తుత పరిస్థితి: 16 వార్డులు ఉండగా.. 35 వేల మందికి పైగా నివసిస్తున్నారు. మొదట్లో పలు కాలనీల్లో లీకేజీలతో నీళ్లు రాక ఇబ్బందులు పడ్డారు. ఇటీవల మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టగా.. కనెక్షన్లు దెబ్బతిన్నాయి. పలు కాలనీల్లో నీళ్లు వృథాగా పోతున్నాయి. రెండు పడక గదుల ఇళ్ల వద్ద ఆదరబాదరాగా పైప్‌లైన్ పనులు చేశారు. దీంతో పలు చోట్ల నీరు రాక ప్రజలు అవస్థలు పడుతున్నారు. డ్రమ్ములు, బిందెల్లో పట్టుకుంటున్నారు. పలు నిర్మాణాలు చేపట్టడంతో కొన్ని కాలనీల్లో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, త్వరగా వాటిని పూర్తిచేయించి మరమ్మతులు చేయిస్తామని, అవస్థలు లేకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మోహన్ తెలిపారు.

పంచాయతీ లెక్కల ప్రకారమే..

ప్రస్తుత పరిస్థితి: రామాయంపేట పురపాలికగా ఏర్పడినా ఇప్పటికీ గ్రామ పంచాయతీ లెక్కల ప్రకారమే భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. పురపాలిక నిబంధనల ప్రకారం జనాభా ప్రాతిపదికన ఒక్కో వ్యక్తికి 135 లీ. నీటిని సరఫరా చేయాల్సి ఉండగా, 2017లో పొందుపరిచిన దాని ప్రకారం పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం 100 లీటర్లే వస్తున్నాయి. డిమాండ్‌కు అనుగుణంగా కాకుండా 4.50 లక్షల లీటర్ల మేర లోటు ఏర్పడుతోంది. స్థానిక వార్డుల్లో అవసరాన్ని బట్టి బోర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. వేసవిలో నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి కమిషనర్ ఉమాదేవి తెలిపారు. వృథాను అరికట్టేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

# పరిహారం అందక.. పనులు సాగక



సిరిసిల్ల : కాళేశ్వరం ప్రాజెక్టులో గోదావరి నుంచి కొండపోచమ్మకు కాల్వలు, పంపుహౌజ్‌ల ద్వారా ప్రస్తుతం రెండు టీఎంసీలు తరలిస్తున్నారు. దీనికి సమాంతరంగా మరో టీఎంసీని తరలించేందుకు 2019–20లో ప్రణాళికలు చేశారు. ఆ ఏడాదే టెండర్లు కూడా పూర్తయ్యాయి. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం తిరుమలాపూర్ నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వరదవెల్లి వరకు కాల్వ తవ్వకం పనులు మందకొడిగా సాగుతున్నాయి. 23.91 కిలోమీటర్ల పొడవును రెండు ప్యాకేజీలు చేశారు. దీనిలో ఇప్పటికీ 40 శాతం భూసేకరణకు సంబంధించి సుమారు రూ.150 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. పరిహారం చెల్లింపులు పూర్తయిన చోట పనులు జరుగుతున్నా తవ్విన మట్టిని పోసేందుకు స్థలం సరిపోవడం లేదు. గతేడాదే గుత్తేదారుకిచ్చిన గడువు ముగిసింది. దానిని ఈ ఏడాది డిసెంబరు వరకు పొడిగించారు. మొత్తంగా ఇప్పటికీ 20 శాతం పనులు కూడా జరగలేదు.

సమస్యలు ఇవీ...అదనపు టీఎంసీ కాల్వ నిర్మాణానికి తొలుత 1,200 ఎకరాలు గుర్తించారు. 2005లో పాత వరద కాల్వ కోసం ఎకరానికి గరిష్ఠంగా రూ.10 లక్షల లోపు ప్రభుత్వం పరిహారం చెల్లించి సేకరించింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి.. సాగునీటి ఇబ్బందులు తొలగడంతో వ్యవసాయ భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీనికితోడు ప్రభుత్వ భూసేకరణకు రైతుల నుంచి వ్యతిరేకత ఎదురవుతోంది.మట్టిని పోసేందుకు ఇబ్బందులు రావడంతో జలవనరులశాఖ పాత వరద కాల్వ భూముల వివరాలతో సర్వే చేసింది. మట్టిని తవ్వి సాగుభూములుగా మార్చేశారు. కొన్ని చోట్లయితే ఏకంగా రెవెన్యూ దస్త్రాల్లోనే నమోదు చేసుకున్నట్లు తేలింది. బోయినపల్లి, గంగాధర, రామడుగు మండలాల్లో వందల ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు తేలింది. కొన్ని చోట్ల పంచాయతీల వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, విద్యుత్తు ఉప కేంద్రాలు నిర్మించారు. ప్రజా అవసరాలను పక్కన పెడితే మిగతా ఆక్రమణలను తొలగించేందుకు రెవెన్యూ, జలవనరులశాఖల అధికారులు కసరత్తు చేస్తున్నారు. పనులు వేగంగా జరగాలంటే మట్టి తరలింపుల్లో ఇబ్బందులు ఉండకూడదు. లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి, బండరాళ్లను జలవనరులు, రెవెన్యూ, గనుల శాఖలు సమన్వయంతో వేబిల్లుల ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు అవసరాలకు విక్రయించాలని ప్రణాళికలు చేశారు. రైల్వేలైను భూసేకరణ కొలిక్కిరాకపోవడం మరో ప్రధాన సమస్యగా మారింది.ప్రణాళికతో ముందుకు...విష్ణు, డీఈ, అదనపు టీఎంసీ కాల్వ ....పరిహారం చెల్లించిన ప్రాంతాల్లో పనులు చేస్తున్నాం. మట్టిని పోసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు చేస్తున్నాం. పరిహారం నిధులు విడుదలైతే పనులు వేగంగా జరిగే అవకాశం ఉంటుంది. రాజరాజేశ్వర జలాశయం కుడివైపు మూడో ప్యాకేజీలోనూ ఆటంకాలు ఏర్పడుతున్నాయి. రాజరాజేశ్వర నుంచి అన్నపూర్ణ జలాశయం వరకు కాల్వ కోసం 470 ఎకరాలు సేకరించారు. ఇందులో అప్పటికే రాజరాజేశ్వరలో భూములు కోల్పోయిన చీర్లవంచ, చింతల్‌ఠాణాకు చెందిన నిర్వాసితులు ఇల్లంతకుంట మండలం ఒబులాపూర్, అనంతరం, తిప్పాపూర్‌లలో వ్యవసాయ భూములు కొనుగోలు చేశారు. వీటి పక్క నుంచే అదనపు టీఎంసీ కాల్వ తవ్వుతున్నారు. ఇందులోని మట్టిని పోసేందుకు 60 ఎకరాలు సేకరించేందుకు రెవెన్యూశాఖ సర్వే చేసింది. నిర్వాసితులు భూమి ఇవ్వమంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో స్థలం లేక రాజరాజేశ్వర జలాశయం ఎఫ్‌ఆర్ఎల్ (ఫుల్ రిజర్వాయర్ లెవల్)కు పైన పోస్తున్నారు. కానీ భారీ వరదలకు ఈ మట్టి అంతా జలాశయంలోకి వెళ్లి పూడికగా మారే అవకాశం ఉంది.రెండు టీఎంసీలున్న వరద కాల్వకు 300 నుంచి 400 మీటర్ల వెడల్పుతో రెండువైపులా భూసేకరణ జరిగింది. అదనపు టీఎంసీకి 110 నుంచి 180 మీటర్ల వెడల్పుతో ప్రణాళికలు చేశారు. ప్రభుత్వానికి ఆర్థికంగా భారం తగ్గించేందుకు 1,200 ఎకరాలను 600 ఎకరాలకు కుదించారు. ఇదే ప్రస్తుతం పనులు చేసేందుకు ఆటంకంగా మారుతోంది.

# రోగ నిర్ధారణ పరీక్షలు ఇక్కడే

భువనగిరి : రోగ నిర్ధారణ పరీక్షల కోసం నిర్మించిన డయాగ్నోస్టిక్ హబ్ భవనం నిర్మాణం దాదాపుగా పూర్తయింది. జిల్లా ఆసుపత్రి ఆవరణలో గతేడాది మార్చి 20న వైద్యఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పనులకు శంకుస్థాపన చేశారు. రూ.1.25 కోట్ల నిధుల అంచనాతో పనులు ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర వైద్యసేవల మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్(టీఎస్ఎమ్ఎస్ఐడీసీ) ఆధ్వర్యంలో నిర్మాణ పనులు సాగాయి. గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్తులో మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షలకు కావాల్సిన రీతిలో విద్యుత్తు పనులు జరుగుతున్నాయి. వ్యాధి నిర్ధారణకు వినియోగించే పరికరాలు, అధునాతన యంత్రాలు కొన్ని ఇప్పటికే భవనంలోకి చేర్చారు. వాటిని అమర్చేందుకు కావాల్సిన పనులు చేస్తున్నారు.

అందుబాటులోకి రానున్న పరీక్షలు.. జిల్లా కేంద్రాసుపత్రిలో ప్రస్తుతం రక్తం, మూత్రానికి సంబంధించిన దాదాపుగా 19 రకాల పరీక్షలు చేస్తున్నారు. వీటితో పాటు, అల్ట్రాసౌండ్, రక్తంలోని ప్లేట్‌లెట్లు, సీఆర్పీ, ఆర్ఏ, ఏసీవో వంటి 20 రకాలు పరీక్షలు అందుబాటులోకి రానున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.



రేడియోగ్రాఫర్, మైక్రోబయాలజిస్టు, టెక్నిషియన్, పార్మసిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్ నియామక ప్రక్రియ పూర్తయినట్లు సూపరింటెండెంట్ చిన్నానాయక్ తెలిపారు. త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

# గురుకులం.. ఆర్థికంగా పరిపుష్టం

జిన్నారం : తెలంగాణ ఏర్పాటైన తర్వాత ప్రారంభమైన గిరిజన గురుకులాలకు శుభవార్త. మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో గురుకులానికి రూ.5 కోట్ల చొప్పున నిధులు ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. ప్రధానంగా అదనపు భవనాల నిర్మాణానికి ఈ నిధులు వెచ్చించనున్నారు. 2023- 24 విద్యా సంవత్సవానికి అందుబాటులోకి భవనాలు వచ్చేలా టెండర్లు, పనుల కార్యాచరణకు శ్రీకారం చుడుతున్నారు.

ఆరు నెలల్లో పూర్తయ్యేలా..

ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని పలు గిరిజన గురుకులాలకు మేలు జరుగుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని జిన్నారం, నర్సాపూర్, చేగుంటలో 2014కు ముందు ఉన్న గురుకులాలు. తర్వాత కౌడిపల్లి, నారాయణఖేడ్, కంగ్టి, బాచేపల్లిలో ఏర్పాటు చేశారు. బాలురు, బాలికలకు కౌడిపల్లి, నర్సాపూర్, సిర్గాపూర్, మనూర్, జహీరాబాద్, మెదక్ ప్రాంతాల్లో ఉన్నాయి. గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలను మౌలిక వసతులు లేవనే కారణంగా సంగారెడ్డిలో కాకుండా పటాన్‌చెరు మండలం పెద్ద కంజర్ల సమీపంలో నిర్వహిస్తున్నారు. ఒక్కో గురుకులంలో 500 నుంచి 600 మంది విద్యార్థులు ఉన్నారు. చాలీ చాలని గదులతో ఇబ్బంది పడుతున్నారు. ఒక్కోసారి తరగతులను ఆరుబయట, చెట్ల కింద నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2018లో మండల కేంద్రమైన జిన్నారం గిరిజన గురుకులం స్థాయి పెంచి ఇంటర్ తరగతులు ప్రారంభించారు. గదుల సమస్య నెలకొంది. సుమారు 150 మంది వరకు ఇంటర్ విద్యార్థులకు వసతి, తరగతుల నిర్వహణ కష్టమవుతోంది. సమస్యను పలు మార్లు ఉన్నతాధికారులకు నివేదించారు. నిధుల మంజూరు విషయమై తమకు ఎటువంటి ఉత్తర్వులు రాలేదని గురుకుల వర్గాలు చెబుతున్నాయి. సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో స్థలం ఉండటం వల్ల గదుల నిర్మాణానికి నిధులు రావడమే ఆలస్యమని అంటున్నారు. కనీసం ఆరు నెలల్లో భవనాల సమస్య తీరుతుందని భావిస్తున్నారు.

## 'ఆన్‌లైన్' లావాదేవీలపై ఆరా..

నాంపల్లి : ఎన్నికల సమయంలో నోట్ల కట్టలే కాదు.. ఆన్‌లైన్‌లో అడ్డగోలుగా జరిగే నగదు లావాదేవీల కట్టడికి సైతం పోలీసు, ఎన్నికల అధికారులు సమాయత్తమవుతున్నారు. గత శాసనసభ ఎన్నికల సమయంతో పోలిస్తే ప్రస్తుతం డిజిటల్ చెల్లింపులు రెట్టింపయ్యాయి. చిన్న మొత్తాల సొమ్మును గూగుల్ పే, ఫోన్ పే, ఇతర యూపీఐ యాప్‌లతో చెల్లిస్తున్నారు. ముఖ్యంగా ఇప్పటి వరకు సాధారణ లావాదేవీలు జరిగే బ్యాంకు ఖాతాల్లో ఎన్నికల నేపథ్యంలో అనూహ్యంగా నగదు బదిలీలు పెరగడం, పరిమితికి మించి డబ్బు జమ, విత్‌డ్రాలపై నిఘా ఉండనుంది. ఇందుకు బ్యాంకులు, పోలీసులు, ఐటీ విభాగం ఎన్నికల అధికారుల సమన్వయంతో పనిచేయనున్నాయి.

రూ.లక్ష దాటితే లెక్క చెప్పాల్సిందే..!

ఎన్నికల నియమావళి ప్రకారం ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో లావాదేవీలపై నిఘా ఉంటుంది. బ్యాంకుల్లో రూ.లక్షకు మించి డబ్బు జమ, ఉపసంహరణకు సంబంధించిన లావాదేవీలుంటే కారణాలను అంతర్గతంగా తనిఖీ చేస్తారు. రూ.10 లక్షలకు మించి లావాదేవీలు ఉంటే ఆదాయపు పన్ను శాఖకు అందిస్తారు. మరో వైపు రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) ఆధ్వర్యంలో ఇప్పటికే అనుమానాస్పద లావాదేవీలపై నిఘా మొదలైనట్లు అధికారులు పేర్కొంటున్నారు.




ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ కన్వీనర్‌గా ఉంది. అనుమానాస్పద లావాదేవీలను గుర్తించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ప్రామాణిక విధానం (స్టాండర్డ్ ఆపరేటివ్ ప్రొసీజర్) రూపొందించారు. దీని ప్రకారం ఈ–కేవైసీ నిబంధనల ప్రకారం డబ్బు జమ, ఉపసంహరణ, డెబిట్, క్రెడిట్ కార్డు ద్వారా చెల్లింపులు వంటివన్నీ నిశితంగా గమనిస్తారు. చిన్న మొత్తంలో ఎక్కువ సార్లు జరిగే లావాదేలను పరిశీలించేలా వ్యవస్థ అందుబాటులో ఉంది.

జీరో బ్యాలన్స్ ఖాతాలపై దృష్టి

ప్రధానంగా జీరో బ్యాలన్స్ బ్యాంకు ఖాతాలు, ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ఖాతాలను నిశితంగా గమనిస్తున్నట్లు ఎన్నికల అధికారులు, పోలీసులు చెబుతున్నారు. ఎన్నికల ముందు వరకు లావాదేవీలు లేకుండా.. తర్వాత అనూహ్యంగా పెరిగితే కారణాలు ఆరా తీస్తారు. గత ఎన్నికల సందర్భంగా రూ.లక్షల్లో ఖాతాల్లో అనుమానాస్పద నగదు జమను గుర్తించామని అధికారులు ఆ సమయంలో స్పష్టం చేశారు. దీనిపై ఖాతాదారుల్ని ఆరా తీయగా ఇతరులు తాత్కాలికంగా వినియోగించినట్లు వెల్లడైందని పేర్కొన్నారు. ఎన్నికల వేళ నగదు లావాదేవీలపై అప్రమత్తంగా వ్యవహరించకుంటే చిక్కులు కొని తెచ్చుకున్నట్లే.

## పైసా కొట్టు.. ఫాలోవర్లను పట్టు

నాంపల్లి : రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నాయకుల ప్రచార శైలి కొత్త పుంతలు తొక్కుతోంది. ఆయా పార్టీల నేతలు ఆధునిక ప్రచారానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఎన్నికల ప్రచార సభలకు డబ్బులిస్తే వేల సంఖ్యలో జనం హాజరవ్వడం మామూలే. అదే సామాజిక మాధ్యమాలలో అనుసరించే వారి (ఫాలోవర్ల)ని పెంచుకోవాలంటే అప్పటి దాకా ఆన్‌లైన్ వైపు కూడా చూడని నేత ఒక్క పోస్టుతో వేలు, లక్షల మందిని చేరుకోవాలంటే.. వ్యక్తిగత ఖాతా//పేజీ తెరిచి పాలోవర్లు పెరిగే వరకూ వేచి చూడటం సుదీర్ఘ ప్రక్రియ. ఇవేవీ లేకుండా పైసా కొడితే వేలు, లక్షల సంఖ్యలో ఫాలోవర్లను తెచ్చిపెట్టే విధానం అందుబాటులో ఉంది. ఎన్నికల నేపథ్యంలో లక్షల సంఖ్యలో ఫాలోవర్లు ఉండే సామాజిక మాధ్యమ పేజీలను కొందరు డబ్బులకు అమ్మేస్తున్నారు. ఒక్కో ఫాలోవర్‌కు రూ.3 నుంచి రూ.5 వరకు ధర నిర్ణయిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ నగరంతో పాటు నియోజకవర్గాల్లోనూ వీటికి భలే డిమాండ్ ఉందని సోషల్ మీడియా స్ట్రాటజిస్టులు చెబుతున్నారు.

ఓటర్లకు చేరువే లక్ష్యం ఎన్నికల బరిలో నిలవాలనుకునే అభ్యర్థులు పైచేయి సాధించాలని భావిస్తుంటారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సంబంధాలు పెంచుకోవడం.. హోర్డింగులు, ఫ్లెక్సీలతో ప్రకటనలు గుప్పించడం ఒకెత్తు. సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత స్థాయిలో అందరికీ చేరువై తటస్థ ఓటర్లను కూడా ఆకర్షించడం మరో ఎత్తు. ఈ తరహా ప్రచారంపై రాష్ట్ర స్థాయి నేతలే కాదు నియోజకవర్గ స్థాయి నాయకులూ గురిపెట్టారు. బహుళ ప్రజాదరణ పొందిన, లక్షల ఫాలోవర్లు ఉండే పేజీలను డబ్బులిచ్చి కొనుగోలు చేస్తారు. తాత్కాలికంగా సోషల్ స్ట్రాటజిస్టులను నియమించుకుంటున్నారు.

కాసులిస్తే.. కంటెంట్

సామాజిక మాధ్యమాల్లో పోస్టులు, అందులో ఉండే కంటెంట్ నచ్చితేనే ఎక్కువ మంది అనుసరిస్తారు. ఉదాహరణకు కొందరు ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ట్విట్టర్ ఖాతా//పేజీ ప్రారంభిస్తారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజలకు చేరువయ్యే పేరుతో ఇవి మొదలవుతాయి. అడ్మిన్లు ఈ పేజీలో రాష్ట్ర వ్యాప్తంగా వర్తమాన రాజకీయాలకు సంబంధించిన పోస్టులు, నేతల ప్రసంగాల వీడియోలు, కార్టూన్‌లు, మీమ్‌లు నిత్యం పోస్టు చేస్తుంటారు. నెలల వ్యవధిలో ఫాలోవర్ల సంఖ్య లక్షల్లోకి చేరుతుంది. ఫాలోవర్లు బాగా పెరిగాక అడ్మిన్లను తొలగిస్తారు. ఒక్కో ఫాలోవర్‌కు రూ.3–5 చొప్పున ధర నిర్ణయిస్తారు. ఎవరైనా డబ్బు చెలిస్తే ఖాతాను వారి పేర్ల మీదకు మారుస్తారు.

వ్యూహకర్తలకు ఊహించని గిరాకీ..

ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియా స్ట్రాటజిస్టులకు భలే డిమాండ్ పెరిగింది. వీరిని వివిధ పార్టీల అభ్యర్థులు, ఆశావహులు తాత్కాలిక ప్రాతిపదికన నియమించుకుంటున్నారు. ఎన్నికలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు పర్యటనలు, ప్రసంగాలు, నియోజకవర్గ స్థాయిలో ప్రజలను ఆకట్టుకునేలా పోస్టులు చేయడానికి ఉపయోగించుకుంటున్నారు. ఇలా వ్యూహకర్తల్ని అందించేందుకు నగరాల్లో ప్రత్యేకంగా కన్సల్టెన్సీలు ఏర్పాటయ్యాయి.

ఫాలో కాకున్నా.. ప్రకటన ప్రత్యక్షంకొందరు నేతలు సామాజిక మాధ్యమాల్లో సొంతంగా ఖాతాలు తెరిచి ముందు భాగంలో వచ్చేలా ప్రకటనలు ఇస్తున్నారు. నిర్ణీత రుసుముతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ వ్యవస్థ అందుబాటులో ఉంది. యూట్యూబ్ తరహాలో ఈ ప్రకటనలు ఖాతాదారులందరికీ వస్తాయి.

# కరీంనగర్‌కు 7 దశాబ్దాల చరిత్ర




కరీంనగర్ : దిగువ మానేరు జలాశయ పరవళ్లు.. తీగల వంతెన అందాలు.. స్వాగతం పలికే కమాన్.. గంట మోగించి సమయాన్ని తెలిపే క్లాక్ టవర్.. చైనాతోపాటు ఇతర దేశాలకు ఎగుమతవుతున్న గ్రానైట్ పరిశ్రమ రాజకీయ చైతన్యానికి కేంద్ర బిందువైన జిల్లా కేంద్రంగా ఉన్న కరీంనగర్ నియోజకవర్గానికి 71 ఏళ్ల చరిత్ర ఉంది. శాసనసభ స్థానాల పునర్విభజన అనంతరం కొన్ని మండలాలు విడిపోయినప్పటికీ కరీంనగర్ నియోజకవర్గంలో నగరంతోపాటు మూడు మండలాలు కలుపుకొని కొనసాగుతుంది. అనేక మంది రాజకీయ దిగ్గజాలను శాసనసభకు పంపిన కరీంనగర్ నియోజకవర్గంపై కథనం.

ఉత్తర తెలంగాణాకు కేంద్ర బిందువు

కరీంనగర్ ఉత్తర తెలంగాణ జిల్లాలకు కేంద్ర బిందువుగా ఉంది. రాజకీయ చైతన్యంతోపాటు అనేక ఉద్యమ పార్టీల పోరాటాలకు కేంద్ర బిందువైంది. భారాస అధినేత కేసీఆర్ మొదటిసారి అప్పటి తెరాస సింహగర్జనకు ఇక్కడి నుంచే శంఖారావం పూరించారు. దివంగత పీవీ.నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు జరిగిన ఏఐసీసీ ప్రధాన సమావేశాలు అప్పటి ఈ నియోజకవర్గంలోని తిమ్మాపూర్ సమీపాన జరిగాయి. భాజపా రాష్ట్ర జాతీయ సమావేశాలు కూడా జరిగాయి. పీపుల్స్‌వార్ అనుబంధ రైతు బహిరంగ సభ, జనశక్తి బహిరంగ సభలకు కేంద్ర బిందువైంది. సాహిత్య, సాంస్కృతిక రంగాలకు కూడా పుట్టినిల్లయ్యింది. ముఖ్యంగా ఉమ్మడి జిల్లా కేంద్రం కావడంతో అన్ని ప్రధాన రాజకీయ పార్టీల ముఖ్య నేతలంతా ఇక్కడే నివాసముంటారు. ఇక్కడ జరిగే ఎన్నికలలో వారి పరోక్ష పాత్ర ఉంటుంది.

ఇతర నియోజకవర్గాలతో పోల్చితే ముస్లిం ఓటర్ల సంఖ్య కూడా ఎక్కువగా ఉంది. మిగిలిన వారు అత్యధికులు హిందూ ఓటర్లు ఉంటారు. మున్నూరుకాపు, పద్మశాలి, గౌడ, ముదిరాజ్, రెడ్డి, దళిత వర్గాల ఓట్లు ఎక్కువగానే ఉంటాయి. ఇక వ్యాపారపరంగా పరిశీలిస్తే కరీంనగర్ సమీపంలోని బావుపేటలో వందలాది గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ పరిశ్రమలు క్వారీలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఇక్కడి టాక, బ్రౌన్ రకం విదేశాలకు ఎగుమతి అవుతుంది. మూడు వైద్య కళాశాలలు, మొక్కజొన్న పరిశోధన కేంద్రం, ఇంజినీరింగ్ కళాశాలలు, విశ్వవిద్యాలయం వంటి వాటితో విద్యా, వైద్య, వ్యవసాయపరంగా తనదైన ముద్ర వేసుకుంది. పారిశ్రామికంగా కూడా ముందు వరుసలో ఉంది. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా(ఆర్టీసీ)లో ముందుంది. రైల్వే సౌకర్యాలు ఇప్పుడిప్పుడే మెరుగుపడుతున్నాయి. ఇక్కడ చదువుకున్న అనేక మంది లండన్, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, గల్ఫ్ దేశాలలో స్థిరపడ్డారు. ఉద్యోగాలూ చేస్తున్నారు. అన్ని రంగాల్లో ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం ఉంది. వివిధ రాష్ట్రాల వారు ఇక్కడ పలు వ్యాపారాలు చేస్తూ స్థిరపడుతున్నారు.

హ్యాట్రిక్ సాధించిన వారిలో కాంగ్రెస్, భారాస పార్టీల నేతలున్నారు. ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించిన వారిలో చొక్కారావు ఎం.సత్యనారాయణరావు తెదేపా నుంచి సి.ఆనందరావు భారాస నుంచి గంగుల కమలాకర్ మంత్రులుగా ఆయా ప్రభుత్వాల్లో సేవలందించారు. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ అయిదు సార్లు, తెదేపా నాలుగు పర్యాయాలు పీడీఎఫ్, సోషలిస్ట్, స్వతంత్ర, సంజయ్ విచార్ మంచ్‌లు ఒక్కోసారి, రెండు సార్లు భారాస విజయం సాధించాయి.

1952లో ఏర్పడిన ఈ నియోజకవర్గానికి ఇప్పటివరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇప్పుడు జరగబోయేది 16వ ఎన్నిక. మొట్టమొదట ఈ స్థానానికి పీడీఎఫ్ ప్రాతినిధ్యం వహించింది. ఆ తర్వాత కాంగ్రెస్, సోషలిస్ట్ పార్టీ, అనంతరం వరుసగా కాంగ్రెస్ మూడు సార్లు గెలిచాయి. 1983లో సంజయ్ విచార్ మంచ్ తర్వాత తెదేపా 1989 స్వతంత్రులు కైవసం చేసుకున్నారు. మళ్లీ రెండు సార్లు తెదేపా 2004లో కాంగ్రెస్ దిగ్గజం ఎమ్మెస్సార్ విజయం సాధించారు. 2014లో ప్రస్తుత మంత్రి గంగుల కమలాకర్ తెదేపా నుంచి పోటీ చేసి విజయం సాధించి మధ్యలో భారాస తీర్థం పుచ్చుకున్నారు. 2014–2019 ఎమ్మెల్యే స్థానాన్ని పదిలపర్చుకున్నారు. నాలుగోసారి ఆయన మళ్లీ పోటీ పడుతున్నారు.

ప్రస్తుత నియోజకవర్గం పరిధి: ప్రస్తుతం కరీంనగర్ నియోజకవర్గంలో నగర పాలక సంస్థ, కొత్తపల్లి మున్సిపాలిటీ, కొత్తపల్లి మండలం, కరీంనగర్ గ్రామీణం, కరీంనగర్ అర్బన్ మండలాలు ఉన్నాయి.

# వరద ముప్పు తొలగేనా..!



ధర్మపురి: ధర్మపురి గోదావరినది వద్ద కరకట్ట నిర్మాణం చేపట్టాలనే ప్రతిపాదనలపై కొంత కదలిక వచ్చింది. నీటి పారుదలశాఖ, మున్సిపల్ అధికారులు త్వరలో సమగ్ర సర్వే చేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పించే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. పురపాలిక పక్షాన ఓసారి సర్వే నిర్వహించి ఈ నిర్మాణానికి రూ.4 నుంచి రూ.5 కోట్ల వరకు వ్యయం కావచ్చని ప్రాథమిక అంచనా వేశారు. త్వరలోనే రెండు విభాగాలకు చెందిన అధికారులు దీనిపై సమగ్ర సర్వే చేపట్టనున్నట్లు సమాచారం.

ఏటా కడగండ్లేనా?

ప్రతీ సంవత్సరం వానాకాలం వచ్చిందంటే చాలు తీర ప్రాంతంలోని కాలనీ వాసులు బిక్కు బిక్కుమంటూ కాలం వెల్లదీయాల్సిన దుస్థితి. ఇప్పటికీ కడెం, ఎల్లంపల్లి జలాశయాలకు నిరంతరం ప్రవాహం కొనసాగుతోంది. మునుపెన్నడూ లేని విధంగా ఈ ప్రాంతంలో విచిత్ర పరిస్థితి ఏర్పడింది. ఏటా ఆగస్టు, అక్టోబర్ నెలల్లోనే భారీగా వరద వచ్చి ఈ రెండు జలాశాయాలకు వరద పోటెత్తేది. ఈ ఏడాది అలా కాకుండా నెలల తరబడి వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. భారీ వర్షాలు కురిశాయంటే చాలు అధికారులకు కంటిమీద కునుకు ఉండటం లేదు. వరద గేట్లను ఎత్తేయడం, నీటిని వదలడంపైనే శ్రద్ధ పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. గోదావరినది జలాల వినియోగం పెరిగినందున రైతులకు పంట నష్టం కలగకుండా తీర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాల్సి వస్తోందని అధికారులు పేర్కొంటున్నారు. మరోవైపు ఈ రెండు జలాశయాల గేట్లను ఎత్తేసి దిగువకు నీటిని వదులుతున్నారు. గత నెలలో నిర్మల్ జిల్లా కడెం జలాశయం ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో లక్షల క్యూసెక్కుల వరద నీరు డ్యాంలోకి పోటెత్తగా అంతే మొత్తంలో నీటిని దిగువకు వదిలారు. ఎల్లంపల్లి జలాశయానికి ఆగస్టు నెలలో భారీ ఎత్తున వరద నీరు చేరడంతో 48 గేట్లను ఎత్తివేసి 9.3 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదిలారు. ప్రస్తుతం రెండు గేట్లను ఎత్తి 5618 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. నిరంతర ప్రవాహంతో నదీ తీర ప్రాంత ప్రజల్లో ఆందోళన వీడటం లేదు. ఇప్పటికే గోదావరినది జలాల ఆధారంగా వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. భవిష్యత్తులో మళ్లీ వరద వస్తే తమ పరిస్థితి ఎలాఅని ఇక్కడి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికీ ధర్మపురితో పాటు ఎగువ ప్రాంతంలో నదీ నీటిమట్టం ఏమాత్రం తగ్గకుండా నిండుగా కొనసాగుతోంది.

తప్పని ఆందోళన...ధర్మపురి పట్టణంలో కుమ్మరివాడ, బ్రాహ్మణసంఘం వాడ, నదీ తీరంలోని వైశ్యసత్రం, బోయవాడ, ప్రభుత్వ ఆసుపత్రి పరిసర కాలనీలు, ఒడ్డెర కాలనీ, విద్యుత్తు సబ్‌స్టేషన్ ప్రాంతాలకు ప్రతిఏటా వరద భయం వీడటం లేదు. కడెం, ఎస్సారెస్పీ నుంచి నీటిని వదిలే సమయంలో ఆగమేఘాలపై ఇళ్లను అధికారులు ఖాళీ చేయిస్తున్నారు. అత్యవసర సమయంలో ఇక్కడి ప్రజలు కేవలం కట్టుబట్టలతో బయటకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. నదీ తీరంలోని మంగళిగడ్డపై ఉన్న చిరు వ్యాపారులు వరదలతో నానా ఇబ్బంది పడుతున్నారు. ఒకొక్కరు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు తమ సామగ్రిని వరదనీటిలోనే వదిలి ప్రాణాలతో బయటపడుతున్నారు. పాలకులు, అధికారులు ఆయా అంశాలపై సమగ్ర సర్వే చేయించాల్సిన అవసరం ఉంది. కడెం, ఎస్సారెస్పీ జలాశయాల నుంచి వరద నీటిని ఎంత వదిలితే ధర్మపురిలో ఎక్కడి వరకు వస్తాయనే విషయంపై అధ్యయనం చేయాలి. ఆ తర్వాత నిధులు కేటాయించి కరకట్ట నిర్మిస్తే భవిష్యత్తులో ధర్మపురి పట్టణానికి గోదావరి వరద ముప్పు తప్పుతుందని ఇక్కడి ప్రజలు భావిస్తున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## ఖాతాలపై నిశిత నిఘా

పెద్దపల్లి : ఎన్నికల్లో నగదు, మద్యం పంపకాలను అడ్డుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఓటర్లను ప్రభావితం చేసే నగదు బదిలీలపై ప్రత్యేక దృష్టి సారించింది. బ్యాంక్ ఖాతాలు, డిజిటల్ లావాదేవీలను నిశితంగా పరిశీలించాలని అధికారులకు ఆదేశించింది. ఎన్నికల్లో పోటీ చేసే ఆశావహులతో పాటు వారి బంధువులు, స్వశక్తి సంఘాలు, పింఛన్‌దారుల ఖాతాలపై నిఘా పెంచింది. రూ.50 వేల కంటే అధికంగా డబ్బు విడుదల చేస్తున్న ఖాతాలపై ఆరా తీస్తున్నారు. స్థానిక బ్యాంకర్లతో పాటు రాష్ట్ర స్థాయిలో లావాదేవీల నివేదికలను పరిశీలిస్తున్నారు.

వివరాల సేకరణ ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా డబ్బు పంపిణీపై గట్టి నిఘా పెంచారు. పాలనాధికారి పర్యవేక్షణలో లీడ్ బ్యాంక్ మేనేజర్లను సమన్వయం చేసుకుంటూ ప్రతి ఖాతా కదలికలను గమనిస్తున్నారు. ఒక బ్యాంక్ నుంచి మరో బ్యాంక్‌కు(నిఫ్టు) బదిలీలు చేసే ఖాతాలపై కన్ను వేస్తున్నారు. ప్రతి ఖాతాలో లావాదేవీలు ఎలా జరుగుతున్నాయనే వివరాలు సేకరించనున్నారు. ఆసరా, విశ్రాంతి ఉద్యోగుల ఖాతాలపై నిఘా ఉంచారు.

## కోతలు ప్రారంభం...
## కొనుగోళ్లకు సన్నాహాలు

సూర్యాపేట : జిల్లాలో వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాలను ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ముందస్తుగా వరి నాట్లు వేయడంతో ఇప్పటికే కోతలు ప్రారంభమయ్యాయి. వరి కోతలు చేసిన కొందరు రైతులు ధాన్యాన్ని ఆరబెట్టగా.. మరికొందరు మార్కెట్కు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ఒక వైపు ఎన్నికలు.. మరో వైపు కొనుగోళ్ల ప్రారంభం కావడంతో అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. కొనుగోళ్ల ప్రణాళిక ప్రకారం సాగేలా చర్యలు తీసుకుంటున్నారు.

296 కేంద్రాలు

జిల్లాలో పీఏసీఎస్ 113, ఐకేపీ 183 వరకు మొత్తం 296 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో 4.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అధికారులు కసరత్తులు చేస్తున్నారు. మార్కెటింగ్, ఐకేపీ, పౌర సరఫరాల శాఖ, సహకార శాఖ, మార్కెటింగ్, రవాణా, గ్రామీణాభివృద్ధి, తూనికల కొలతలు, వ్యవసాయ శాఖ అధికారులకు కేంద్రాల నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నారు. ఇప్పటికే అందుకు తగిన గన్నీ సంచులను సమకూర్చారు. లారీల కొరత లేకుండా ఎప్పటికప్పుడు కొనుగోళ్లు సజావుగా చేపట్టేందుకు ముమ్మరంగా ఏర్పాటు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు, మౌలిక వసతులు, సామగ్రి తదితర అంశాలపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది.

ఇబ్బందులు పునరావృతం కాకుండా...

కొనుగోలు కేంద్రాల్లో తరచూ కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి.



వాటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. రవాణా విషయంలో తగినన్ని వాహనాలు సమకూర్చాలి. జిల్లా వ్యాప్తంగా 800 వరకు లారీలు అవసరం ఉంటుంది. కొనుగోలు కేంద్రాల్లో హమాలీ ఛార్జీలను భిన్నంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు గతంలో వినిపించాయి. అధికారులు వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అన్నదాతలు కోరుతున్నారు. యాసంగిలో లారీలు ఆలస్యం కావడంతో రైతులు నిరసన వ్యక్తం చేసిన ఘటనలు చోటు చేసుకున్నాయి. తరుగు పేరిట దోపిడీ, ధాన్యం డబ్బులు జమ జాప్యాన్ని నివారించాల్సి ఉంది.

టోకెన్ల వారీగా...

కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలు పరిష్కారానికి కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా, డివిజన్, క్లస్టర్, మండల, గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కమిటీలు నిరంతరం కేంద్రాలను పరిశీలిస్తూ కొనుగోళ్లు సక్రమంగా జరిగేలా చూడాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలులో జాప్యం.. తదితర సమస్యలను పరిష్కరించేందుకు టోకెన్ల పద్ధతిని అమలు చేస్తున్నారు. పొలం కోసిన వెంటనే ఏఈవోల వద్దకు వెళ్తే టోకెన్లు అందజేస్తారు. వీటి ప్రకారం రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకొస్తే వెంటనే కాంటా వేస్తారు. దీంతో రోజుల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండదని అధికారులు చెబుతున్నారు.

## సంకల్పం.. దివ్యాలయం ఆవిష్కృతం

యాదగిరిగుట్ట : పునర్నిర్మాణంతో యాదాద్రి పుణ్యక్షేత్రాన్ని మహాదివ్యంగా రూపొందించాలన్న సీఎం కేసీఆర్ అధికార ప్రకటనకు నాటికి తొమ్మిదేళ్లు పూర్తిచేసుకొని పదో ఏడాదిలోకి అడుగిడుతుంది. ఉమ్మడి రాష్ట్రంలో కొనసాగిన యాదగిరిగుట్ట.. తెలంగాణ రాష్ట్రావిర్భావంతో యాదాద్రిగా మార్చారు. ప్రముఖ యాదవ మహర్షి తపస్సుతో స్తంభోద్భవ నరసింహుడు ఐదు రూపాలతో సాక్షాత్కరించిన పంచ నారసింహుల దేవాలయాన్ని సంపూర్ణంగా కృష్ణశిలతో నిర్మించారు. ఆలయంతో పాటు ఇతర వనరులతో క్షేత్రాభివృద్ధి కోసం ఇప్పటి వరకు సుమారు రూ.1200 కోట్లు ఖర్చయినట్లు వైటీడీఏ చెబుతోంది. రాష్ట్ర సాధనకు ఉద్యమిస్తున్న దశలోనే 2007లో కేసీఆర్ ఈ క్షేత్రాన్ని సందర్శించినప్పుడే ఆలయాన్ని విశ్వఖ్యాతిగాంచేలా పునర్నిర్మించాలని తలంచారు. నాటి ఆలోచనను సీఎం హోదాలో 2014 అక్టోబరు 17న లోకానికి చాటారు. అరెకరంలోని ప్రధానాలయాన్ని 4.03 ఎకరాలకు విస్తరించి పునర్నిర్మించారు. క్షేత్రాభివృద్ధిలో భక్తులకు వనరుల కల్పనకు పరిసరాల్లో సుమారు రెండు వేల ఎకరాలు సేకరించారు. కొండ కింద పెద్ద గుట్టపై సేకరించిన 900 ఎకరాల్లో 250 ఎకరాల్లో లే అవుట్ పనులు పూర్తిచేశారు.

క్షేత్రాభివృద్ధికి ప్రత్యేక అథారిటీని ఏర్పరిచి, ప్రభుత్వ నిధులు కేటాయించడం విశేషం. మరో తిరుమలగా ఆధ్యాత్మిక క్షేత్రంగా రూపొందించే లక్ష్యంతో మన సంస్కృతిని చాటేలా వివిధ శిల్పకలా శోభితంగా 1500 నక్షాలతో, అష్టభుజి మండప ప్రాకారాలు, నలువైపులా ఆరు రాజగోపురాలు, గర్భాలయంపై 45 అడుగుల ఎత్తులో దివ్య విమానంతో పంచ నారసింహుల దేవాలయాన్ని తీర్చిదిద్దారు. విమానాన్ని స్వర్ణమయం చేసేందుకు భక్తుల నుంచి బంగారం సేకరిస్తున్నారు. అనుబంధ శివాలయాన్ని విస్తరించి పునర్నిర్మించారు. కొండ కింద ఉత్తర ముఖంగా సేకరించిన భూముల్లో ఆలయానికి చెందిన వనరులతో కూడిన ఆధ్యాత్మిక వాడ ఆవిష్కృతమైంది. ఆ వాడ సమీపాన చిన్ని కొండపై వీఐపీల కోసం 14 విల్లాలు, ఒక ప్రెసిడెన్షియల్ సూట్లను నిర్మించిన విషయం తెలిసిందే. భక్తుల పుణ్యస్నానాలకు లక్ష్మీ పుష్కరిణి కొత్తగా ఏర్పరిచారు. దైవ కార్యాలకు కొండపైనే విష్ణు పుష్కరిణిని పునరుద్ధరించారు.

యాదాద్రి క్షేత్రాన్ని ప్రముఖ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు సమీపాన ఆంజనేయ, నృసింహ అభయారణ్యాలతో పాటు మినీ శిల్పారామం ఏర్పాటు చేశారు. కొండ కింద గిరి ప్రదక్షిణ రహదారి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక యాదాద్రి పరిసరాలను హరితమయంగా మార్చారు. పెద్దగుట్టపై ఆలయ నగరిలో భక్తుల బసకు కాటేజీల నిర్మాణానికి లేఅవుట్ పనులు పూర్తిచేశారు.

# వైద్య సేవలకు భరోసా!

వరంగల్ : పేదలకు ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ పథకాన్ని అమలు చేస్తున్నారు. రూ.2 లక్షల వరకు ఎలాంటి ఖర్చు లేకుండా ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందే అవకాశం కల్పించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకంలో నమోదు చేసుకున్న ప్రతి వ్యక్తికి దేశ వ్యాప్తంగా ఎక్కడైనా రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంది. తాజాగా రెండు పథకాల్లో 1672 వ్యాధుల చికిత్సకు రూ.5 లక్షల వరకు వైద్య సేవలు పొందే అవకాశం ఉండేలా ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఈకేవైసీ ద్వారా నమోదు చేస్తున్నారు.

మరింత ప్రయోజనం

ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరనుంది. రాష్ట్రంలో గతంలో అమలు చేసిన ఆరోగ్య శ్రీ పథకం ద్వారా 938 వ్యాధులకు రూ.2 లక్షల వరకే చికిత్స అందించేవారు. తాజాగా ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకంలో నమోదు చేసుకున్నవారికి 1672 వ్యాధులకు రూ.5 లక్షల వరకు చికిత్స పొందే అవకాశం కల్పించారు. అలాగే తప్పనిసరిగా మందులు వాడాల్సి ఉన్నటువంటి 126 రకాల వ్యాధిగ్రస్తులకు చికిత్స అనంతరం ఏడాది పాటు ఉచితంగా మందులను అందించనున్నారు. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకంలో ఈకేవైసీ నమోదు పూర్తయితే సంబంధిత కార్డును పోస్టు ద్వారా ఇంటికి పంపించనున్నారు. ఈ కార్డు ఏ రాష్ట్రంలోనైనా అమలులో ఉండటంతో ఎక్కడైనా వైద్యం పొందే అవకాశం ఉంటుంది. ఇది ఎంతో మంచి కార్యక్రమమని, రేషన్



కార్డు ఉన్నటువంటి ప్రతి ఒక్కరూ ఈకేవైసీ నమోదు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 3.47 లక్షల మంది అర్హులు

భూపాలపల్లి జిల్లాలో రేషన్‌కార్డు ఉండి అందులో పేరున్న ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ పథకాలకు అర్హులు.. అలాంటి వారు జిల్లాలో 3.47 లక్షల మంది ఉన్నట్లు అధికారులు తెలుపుతున్నారు. ఇప్పటివరకు 4338 కుటుంబాలకు సంబంధించి 8418 మందికి ఈకేవైసీ నమోదు చేశారు. ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ పథకాలకు సంబంధించి రేషన్ కార్డులో పేరున్న ప్రతి ఒక్కరూ విడివిడిగా ఈకేవైసీ నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఆధార్‌తో లింక్ చేసిన చరవాణి నంబర్‌తో కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీ), మీసేవా, ఆరోగ్య మిత్ర ద్వారా ఈకేవైసీ నమోదు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. ఎవరైనా వ్యక్తి అత్యవసర చికిత్స కోసం ఆసుపత్రిలో చేరితే వివరాలు నమోదు చేసుకునే వరకు సమయం ఎక్కువ అవుతుంది. అప్పటికే ఈకేవైసీ నమోదు చేసుకోవడం ద్వారా వివరాల నమోదు సులువుగా ఉండి రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తయి చికిత్స వెంటనే ప్రారంభించే అవకాశం ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి

– డాక్టర్ కమల్‌చంద్‌నాయక్, ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ ఉమ్మడి వరంగల్ జిల్లా.

ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.5 లక్షల వరకు చికిత్స పొందే అవకాశం ఉంటుంది. అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేసుకోవాలి. ఈకేవైసీ నమోదుపై అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నాం. ఆహార భద్రతకార్డు, ఆధార్, ఆధార్ లింకు గల చరవాణితో ఆరోగ్య మిత్రల వద్ద, కామన్ సర్వీస్ సెంటర్, మీ సేవలో ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి.


# భద్రకాళి తటాకం మురుగుమయం

వరంగల్ : వరంగల్–హనుమకొండ నగరాల వారిధిగా పేరుగాంచిన భద్రకాళి తటాకం మురుగు మయమవుతోంది. హంటర్‌రోడ్ పాత ఆర్టీసీ టైర్ కంపెనీ వైపు కొందరు ప్రైవేటు ప్లాట్ల అమ్మకాల కోసం చెరువు కట్టను తవ్వి మురుగు మళ్లిస్తున్నారు. రెండు, మూడు నెలల నుంచి హంటర్‌రోడ్, పద్మాక్షిగుట్ట కాలనీ, న్యూశాయంపేట వైపు వచ్చే మురుగునీరంతా చెరువులోకి వదులుతున్నారు. ఫుల్ ట్యాంకు లెవల్ (ఎఫ్‌టీఎల్) నిబంధనలకు విరుద్ధంగా కట్టను తవ్విన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు ఫిర్యాదు చేసినా గ్రేటర్ వరంగల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు కదలడం లేదు. ప్రైవేటు వ్యక్తులకు భయపడి చెరువు వైపే రావడం లేదని తెలిసింది. ఒకవైపు రూ.120 కోట్లు వెచ్చించి భద్రకాళి బండ్ సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. ఇటీవలే వరంగల్ ఉమ్మడి జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బోటింగ్ షికారు ప్రారంభమైంది. చెరువులోకి చేరుతున్న మురుగు నీటితో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. భద్రకాళి బండ్ వద్ద, శ్రీభద్రకాళి దేవాలయం, పోతనరోడ్ వైపు దుర్వాసన వస్తోంది.

'ప్రైవేటు ప్లాట్ల కోసం: వరంగల్ పోతనరోడ్ నుంచి ఎన్టీఆర్‌నగర్, హంటర్‌రోడ్, హనుమకొండ పద్మాక్షిగుట్ట వరకు భద్రకాళి చెరువు చుట్టు 1996లో ఫోర్ షోర్ బండ్ ఏర్పాటైంది. చెరువు నలువైపులా కట్ట ఉండటంతో మురుగునీరు రావడం లేదు. హనుమకొండ పద్మాక్షికాలనీ, హంటర్‌రోడ్ పాత ఆర్టీసీ టైర్ కంపెనీ వెనుక, న్యూశాయంపేట కూడలి వైపు 50–60 ప్రైవేటు ప్లాట్లు ఉన్నాయి. ఇవి కట్ట ఇవతలి వైపు ఉంటాయి. హంటర్‌రోడ్ జూపార్కు, న్యూశాయంపేట, పద్మాక్షిగుట్ట రోడ్ తదితర ప్రాంతాల్లో వెలువడే మురుగునీరంతా ప్రైవేటు స్థలాల్లో నిలిచాయి. ఖాళీ ప్లాట్లలో ఆగిన మురుగునీరును బయటకు పంపించేందుకు హంటర్‌రోడ్–పద్మాక్షిగుట్ట చెరువు కట్టను రెండు ప్రాంతాల్లో తవ్వేశారు. మురుగునీరంతా నేరుగా చెరువులోకి వెళ్తున్నాయి. కట్టను తవ్వడంపై స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిసింది. ప్రైవేటు ప్లాట్ల అమ్మకాల కోసం ఇద్దరు కార్పొరేటర్లు తెరవెనుక ఉండి కట్టను తవ్వించారని తెలిసింది.

ఎఫ్‌టీఎల్ నిబంధనల ఉల్లంఘన: హంటర్ రోడ్, పద్మాక్షిగుట్ట, నవయుగ కాలనీ, ద్వారక కాలనీ, సిటిజన్ క్లబ్ వెనుకల, గాయత్రినగర్, సాయినగర్, ఎన్టీఆర్‌నగర్, బృందావన్ కాలనీ, సంతోషిమాత కాలనీల్లో ఫుల్ ట్యాంకు లెవల్(ఎఫ్‌టీఎల్) నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు, ప్లాట్లు చదును చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. గ్రేటర్ వరంగల్ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు చూసీచూడనట్లుగా ఉంటున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులకు మామూళ్లు ముట్టజెప్పి నిర్మాణాలు చేపడుతున్నారు.

# దూరమే భారం..



ఖమ్మం : విలువైన రక్త పరీక్షలను పేదలకు ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం 'తెలంగాణ డయాగ్నస్టిక్స్' సేవలకు శ్రీకారం చుట్టింది. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రణాళికారాహిత్యం రోగులకు, అవసరార్థులకు ఇబ్బంది తెచ్చిపెడుతోంది.. విశాల విస్తీర్ణంలో ఉన్న భద్రాద్రి జిల్లాలో దూరం భారమైతే.. ఖమ్మం జిల్లాలో సకాలంలో బిల్లులు విడుదల కాకపోవటం సేవలకు ప్రతిబంధకంగా మారాయి.

సేవలు ఇలా.. టి–డయాగ్నస్టిక్స్ ద్వారా మొత్తం 52 రకాల రక్త పరీక్షలు చేస్తారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, టీబీ సెంటర్‌లు, బస్తీ దవాఖానల నుంచి ప్రతి రోజూ రక్త నమూనాలు సేకరించి జిల్లా కేంద్రంలో ఉండే హబ్‌కు చేరవేరుస్తున్నారు. ప్రత్యేకంగా కేటాయించిన అద్దె వాహనాల్లో ఉభయ జిల్లాల్లోని ఆరు రూట్ల ద్వారా రక్త నమూనాలు సురక్షిత స్థితిలో తరలిస్తున్నారు. డీఎంహెచ్‌ఓ, సూపరింటెండెంట్ పర్యవేక్షణలో మెడికల్ ఆఫీసర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు రక్త నమూనాలు పరీక్షించి ఫలితాలు అందిస్తున్నారు. జిల్లాలోని ప్రతి వైద్యశాల ఏదో ఒక రూట్ పరిధిలోకి వస్తుంది.

టేకులపల్లి మండలం లచ్చగూడెంకు చెందిన వెంకట్ జ్వరంతో బాధపడుతూ సులానగర్ పీహెచ్‌సీకి రక్త పరీక్షలకు వెళ్లాడు. వైద్యాధికారి ఫలాన తేదీన వచ్చి చేయించుకోమని చిట్టి రాసిచ్చారు. భద్రాద్రి జిల్లాలో ఏజెన్సీలో అన్ని పీహెచ్‌సీల్లో పరిస్థితి ఇలానే ఉంది. నమూనాలను తీసుకెళ్లే వాహనం ఆ రూట్‌లో వచ్చినప్పుడే రక్త పరీక్షలు చేయించుకునే అవకాశం ఉంది. దీంతో రోగులు ప్రయివేటు డయాగ్నస్టిక్ కేంద్రాల బాటపడుతున్నారు.

భద్రాద్రి జిల్లాలో ఇబ్బందులు ఇలా..

1. ఆరు రూట్లకు ఆరు అద్దె వాహనాలను ఏర్పాటు చేశారు. పట్టణ ప్రాంతాల్లో ప్రతీ రోజు రక్త నమూనాలు సేకరిస్తున్నారు. కానీ ఏజెన్సీ ప్రాంతాల్లోని పీహెచ్‌సీలకు వారానికి రెండుసార్లు మాత్రమే వెళ్తున్నారు. సెలవు దినాలు వస్తే ఒక్కసారే వెళ్తున్నారు.
2. ఆరోగ్య కేంద్రాల నుంచి రక్త నమూనాలు టీహబ్‌లకు తీసుకెళ్లేందుకు నాలుగు చక్రాల వాహనాలు వినియోగించాలి. కానీ ఇల్లెందుతోపాటు మారుమూల ఏజెన్సీ పరిధిలో కొన్నిచోట్ల ద్విచక్ర వాహనాలు వినియోగిస్తున్నారు. పూర్తి రక్షిత పద్ధతుల్లో నమూనాలు తీసుకెళ్తేనే ఫలితాల్లో వాస్తవికతకు ఆస్కారం ఉంటుంది.

ఎందుకిలా?

టి–హబ్‌కు నమూనాలు తీసుకొచ్చే బాధ్యతను టెండరు ప్రాతిపదికన అద్దె వాహనాలకు అప్పగించారు. ఇందుకు నెలకు ఒక్కో వాహనానికి రూ.33 వేల కిరాయి చెల్లిస్తున్నారు. నెలలో ప్రతి వాహనం మొత్తం 2,500 కిలోమీటర్లు తిరిగేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. భద్రాద్రి జిల్లా ఏజెన్సీ ప్రాంతం కావడం, పీహెచ్‌సీల మధ్య దూరం ఎక్కువగా ఉండటం సమస్యగా మారింది. వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తే సగం రోజుల్లోనే 2,500 కిలోమీటర్లు పూర్తవుతాయి. జిల్లాలో నాలుగు రూట్లలో పీహెచ్‌సీల మధ్య దూరం ఎక్కువ ఉండటంతో అద్దె వాహన యజమానులు నెలలో 12 రోజులు మాత్రమే నడిపిస్తున్నారు. మిగిలిన రెండు రూట్లు టీహబ్‌కు దగ్గరగా ఉండటంతో ప్రతి రోజూ సేకరిస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో..


భద్రాద్రితో పోలిస్తే ఖమ్మం జిల్లాలో సేకరణ పరంగా మెరుగైన పరిస్థితులున్నాయి. దాదాపు అన్ని రూట్లలో నిత్యం వాహనాలు తిరుగుతున్నాయి. కానీ వాహనాలకు సకాలంలో బిల్లులు రావటం లేదు.

సైట్ సక్రమంగా పనిచేయక..

టీహబ్‌కు పంపే రక్త నమూనాలకు సంబంధించి రోగి సమాచారాన్ని ల్యాబ్ టెక్నీషియన్లు సంబంధిత సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. పీహెచ్‌సీ నుంచి రోగి సమాచారం అప్‌లోడ్ చేశాకే నమూనాలు పరీక్షించాలి. ప్రారంభంలో సైట్ సక్రమంగానే పనిచేసినా ఐదారు నెలలుగా అదనపు సర్వీస్‌లు జత చేయడంతో సర్వర్ బిజీ అయింది. దీంతో ఉభయ జిల్లాల్లోని పీహెచ్‌సీల్లో రోగి తాలూకు సమాచారం పొందుపరిచేందుకు ఎల్‌టీలు అవస్థలు పడుతున్నారు. 24 గంటల్లో రోగి చరవాణికి చేరాల్సిన ఫలితం ఒక్కోసారి నాలుగు రోజులైనా రావడం లేదు. మరోవైపు పీహెచ్‌సీలో ప్రింటర్లు, కంప్యూటర్లు కొన్నిసార్లు మొరాయిస్తున్నాయి.

"జిల్లాలో పీహెచ్‌సీల మధ్య దూరం ఎక్కువ. నాలుగు రూట్లలో రోజు విడిచి రోజు చొప్పున పంపిస్తున్నాం. ప్రతి రోజు రక్తనమూనాలు సేకరించేందుకు బడ్జెట్ పెంచాలని కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపించాం."జేవీఎల్ శిరీష, డీఎంహెచ్‌ఓ, భద్రాద్రి కొత్తగూడెం.

# కాంగిరేసులో టికెట్ల గుబులు



ఖమ్మం : కాంగ్రెస్‌లో ఆశావహులకు టికెట్ల గుబులు పట్టుకుంది. తొలి జాబితాలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని రెండు స్థానాలకు మాత్రమే అభ్యర్థులు ఖరారయ్యారు. మిగిలిన ఎనిమిది టికెట్ల కోసం ఆశావహులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఒక్కో స్థానంలో ఇద్దరు, ముగ్గురు తీవ్రంగా పోటీపడుతున్నారు. అధిష్ఠానం ఎవరి అభ్యర్థిత్వం వైపు మొగ్గుచూపుతుందోనని మదనపడుతున్నారు. ఉభయ జిల్లాల్లోని సిట్టింగ్ ఎమ్మెల్యేలు భట్టి విక్రమార్క, పొదెం వీరయ్య వరుసగా మధిర, భద్రాచలం టికెట్లు దక్కించుకున్నారు. వాస్తవానికి తొలిదఫాలో అసమ్మతులు లేని, ఆశావహుల పోటీ తక్కువగా ఉన్నచోట టికెట్లను కాంగ్రెస్ ఖరారు చేసింది. పార్టీ అంతర్గత సర్వేల్లో ఒక్కరికి పూర్తిగా సానుకూలమని తేలిన నియోజకవర్గాల్లోనే అభ్యర్థులను ప్రకటించినట్లు స్క్రీనింగ్ కమిటీ ఛైర్మన్ మురళీధరన్ తెలిపారు. మిగిలిన చోట్ల ఆచితూచి, అందరికీ ఆమోదయోగ్యమైన అభ్యర్థుల్ని రంగంలోకి దించుతామన్నారు. ఇప్పటివరకు టికెట్లు ఖరారవని ఎనిమిది నియోజకవర్గాల రేసు గుర్రాలెవరో తేలాల్సి ఉంది. ఖమ్మంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పాలేరు నుంచి టీపీసీసీ ప్రచార కమిటీ కోఛైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి బరిలో నిలవటం ఖాయంగా కనిపిస్తోంది. వ్యూహాత్మకంగానే తొలి జాబితాలో వీరిద్దరి అభ్యర్థిత్వాలు ప్రకటించలేదన్నది ఆపార్టీ వర్గాల్లో వినిపిస్తున్న మాట. రెండు నియోజకవర్గాల్లోనూ ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన నాయకులను బుజ్జగించిన తర్వాతే వీరి పేర్లు ప్రకటించాలని యోచిస్తున్నట్లు తెలిసింది. మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపిక కాంగ్రెస్‌కు సవాల్‌గా మారినట్లు సమాచారం. సత్తుపల్లి నుంచి ఐదుగురి మధ్య పోటాపోటీ నెలకొంది. ఇల్లెందు, పినపాక, అశ్వారావుపేటలోనూ టికెట్ పోరు తారస్థాయికి చేరింది. కొత్తగూడెం, వైరాలో ఆశావహులు అధికంగా ఉన్నా.. కమ్యూనిస్టులతో పొత్తులు ఈ రెండు స్థానాల్లో తమ అభ్యర్థిత్వానికి ఎసరు పెట్టేలా ఉన్నాయన్న ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది. పొత్తులో భాగంగా కొత్తగూడెం సీటును సీపీఐకి కేటాయించటం ఖాయంగా కనిపిస్తోంది. ఉభయ జిల్లాల నుంచే సీపీఎంకు ఒక స్థానం ఇవ్వాల్సి వస్తుండటంతో ఏది కేటాయించాలనే అంశంపై కాంగ్రెస్ మల్లగుల్లాలు పడుతోంది.

అసంతృప్తుల భేటీ..!

ఇటీవల చోటుచేసుకుంటున్న రాజకీయ సమీకరణాలు ఆపార్టీ ముఖ్యనేతలకు గుబులు పుట్టిస్తున్నాయి. నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతానికి పనిచేసిన నాయకులు.. కొత్త నేతల రాకతో రగిలిపోతున్నారు. ఖమ్మం, పాలేరు, కొత్తగూడెం నియోజకవర్గాల నుంచి టికెట్ ఆశించిన నాయకులు ఇటీవల ప్రత్యేకంగా సమావేశమవటం చర్చనీయాంశంగా మారింది. రాయల నాగేశ్వరరావు, పోట్ల నాగేశ్వరరావు, ఎండీ జావీద్ తదితరులు రెండ్రోజుల క్రితం ఖమ్మంలో భేటీ అయ్యి పార్టీలో జరుగుతున్న పరిణామాలపై చర్చించారు. కష్టకాలంలో కాంగ్రెస్‌ను బతికించడమే కాకుండా.. కార్యకర్తలకు ఏళ్లుగా అండదండలు అందించిన తమను పక్కనబెట్టి కొత్తగా పార్టీలో చేరిన నాయకులకు టికెట్లు దక్కుతాయేమోనని రగిలిపోతున్నారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకు ప్రధాన అనుచరులుగా ఉన్న వీరంతా.. ఇక తాడోపేడో తేల్చుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఖమ్మంలో భట్టి విక్రమార్కతో మంగళవారం భేటీకానున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ అసంతృప్త నాయకులను సంప్రదించేందుకు భారాస ముఖ్యనేతలు రంగంలోకి దిగటం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఔను.. మీ ఓటే కీలకం!

కొత్తగూడెం : 2023 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండినవారు నామినేషన్ల స్వీకరణ గడువుకు పది రోజుల ముందు (అంటే ఈనెలాఖరు) వరకు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే వెసులుబాటు ఉంది.

ఓటుహక్కు ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టు. ఇది దేశ దశ, దిశను మార్చే అస్త్రం. రాజ్యాంగం కల్పించిన హక్కు ద్వారా పాలకులు, ప్రభుత్వాలను ఎన్నుకునే గొప్ప అవకాశం ఉంది. ఒక్క ఓటు వల్ల ఏమీ కాదులే అనుకోకండి. ఆ ఒక్క ఓటే మన ఐదేళ్ల భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ఆ ఒక్క ఓటే నిన్ను పాలించే నాయకుణ్ని ఎన్నుకుంటుంది. శాసనసభ ఎన్నికల పోలింగ్ నవంబర్ 30న జరగనుంది. ఇప్పటికే ఓటరు తుది జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించింది. అయినా అర్హులు ఓటుహక్కు పొందేందుకు మరో అవకాశమిచ్చింది.

సీఎం అభ్యర్థికే భంగపాటు..!

2008లో జరిగిన రాజస్థాన్ శాసనసభ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేసులో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి సీపీ జోషీ తన సమీప ప్రత్యర్థి, భాజపా అభ్యర్థి కల్యాణ్‌సింగ్‌పై ఒక్క ఓటు తేడాతో ఓడిపోయారు. సీపీ జోషీకి 62,215 ఓట్లు రాగా భాజపా అభ్యర్థి కల్యాణ్‌సింగ్‌కు 62,216 ఓట్లు పోలయ్యాయి. కొందరు వ్యక్తులు రెండుచోట్ల ఓటేశారని జోషీ కోర్టుమెట్లెక్కగా రీకౌంటింగ్‌లో ఇద్దరికీ సమానమైన ఓట్లు వచ్చాయి. ఎన్నికల సంఘం డ్రా తీయగా కల్యాణ్‌సింగ్‌ను విజయం వరించింది. పోలింగ్ రోజు జోషీ తల్లి, భార్య, డ్రైవర్ ఓటుహక్కు వినియోగించుకోకపోవటం వల్లే ఫలితం ఆయనకు ప్రతికూలంగా వచ్చిందని అప్పట్లో చర్చనీయాంశమైంది.

డ్రైవర్ ఓటు వేసుంటే..!

2004లో కర్ణాటకలోని సన్తేమరహళ్లి నియోజకవర్గంలో జనతాదళ్‌కి చెందిన ఏఆర్ కృష్ణమూర్తి కాంగ్రెస్ అభ్యర్థి ఆర్.ధ్రువ్‌నారాయణపై ఒక్క ఓటు తేడాతో ఓటమి పాలయ్యారు. భారతదేశ ఎన్నికల చరిత్రలో ఒక్క ఓటు తేడాతో గెలిచిన తొలి అభ్యర్థిగా ఆర్.ధ్రువ్‌నారాయణ రికార్డుకెక్కారు. ఈ ఎన్నికల్లో జనతాదళ్ అభ్యర్థికి 40,571 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థికి 40,572 ఓట్లు వచ్చాయి. పోలింగ్ రోజు కొన్ని కారణాల వల్ల కృష్ణమూర్తి వాహన డ్రైవర్ ఓటేయలేదు. అందువల్లే అతడు ఓటమి పాలయ్యారని అప్పట్లో ప్రచారం జరిగింది.

కేంద్ర ప్రభుత్వమే కూలిపోయింది..పార్లమెంట్‌లో ఒక్క ఓటు ప్రధానమంత్రి భవిష్యత్తును నిర్ణయించింది. ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ తన పదవిని కోల్పోయారు. 1999లో అప్పటి ఎన్డీఏ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా జయలలిత నాయకత్వంలోని ఆలిండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కళగం(ఏఐఏడీఎంకే) ఉండేది. ఆమె పార్టీ మద్దతు ఉపసంహరించుకోవడంతో ప్రభుత్వం మెజార్టీ కోల్పోయింది. 1999 ఏప్రిల్‌లో జరిగిన విశ్వాస పరీక్షలో ఒక్క ఓటు తేడాతో కేంద్ర ప్రభుత్వం కూలిపోయింది. విపక్షాల్లో ఎవరికీ మెజార్టీ లేకపోవడంతో లోక్‌సభ రద్దైంది.

ఈ నెలాఖరు వరకు..

అర్హత ఉన్నా ఇప్పటివరకు ఓటరుగా నమోదు కాకపోతే.. శాసనసభ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోవడానికి ఎన్నికల సంఘం మరో అవకాశమిచ్చింది. వాస్తవానికి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ముగిసింది. అయినా ఈనెల 31 వరకు కొత్త ఓటర్లుగా చేరేందుకు అవకాశముంది.

# ఇంటర్‌లో ప్రవేశాలు అంతంతే..!

వరంగల్ : ఈ విద్యాసంవత్సరంలో (2023–24) వరుసగా ఐదుసార్లు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ప్రవేశాల గడువును రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు పొడిగించినప్పటికీ జిల్లాలోని పది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల సంఖ్య అంతంత మాత్రంగానే ఉంది. గత నెల 16 వరకే ముగిసిందనుకున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సర ప్రవేశాల ప్రక్రియ మళ్లీ ఈ నెల 9వరకు గడువు పొడిగించి కొనసాగించారు. ఈ విద్యాసంవత్సరంలో జూన్ ఒకటి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ప్రవేశాలు అంతంత మాత్రంగానే ఉంటుండంతో ఇంటర్మీడియట్ బోర్డు ప్రవేశాల గడువును ఎప్పటికప్పుడూ పొడిగించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ. ప్రైవేటు కళాశాలల్లో ప్రవేశాలకు ఆలస్య రుసుంను వర్తింపజేశారు. ఐతే విమర్శలు రావడంతో ఈ ఆలస్య రుసుంను ప్రైవేటు కళాశాలలకే పరిమితం చేశారు.

ప్రవేశాలు అంతంతే..

పలుసార్లు గడువు పెంచినా జిల్లాలోని 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ప్రతి కళాశాలలో ఆర్ట్స్, సైన్స్ గ్రూపుల్లో ఒక్కో గ్రూపులో 196 సీట్ల లభ్యత ఉంది. నాలుగు జూనియర్



కళాశాలల్లో వృత్తి విద్యా కోర్సుల్లో ఒక్కో కోర్సులో 30 నుంచి 40 సీట్లు కూడా ఖాళీగా ఉన్నాయి. ఈ నెల 9 వరకు తుది గడువు ముగిసే వరకు జిల్లాలో ఈ కళాశాలల్లో సాధారణ, వృత్తి విద్యాకోర్సులు కలిపి మొత్తం 1109 ప్రవేశాలు జరిగాయి. పది కళాశాలలుండగా కొత్తగూడలో మాత్రం ప్రవేశాల సంఖ్య ఆశాజనకంగా ఉంది.

కారణాలివే..జిల్లాలో వివిధ సంక్షేమ గురుకులాల ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలలున్నాయి. ఈ విద్యాసంవత్సరంలో కొన్ని బీసీ, గిరిజన, కేజీబీవీ గురుకుల పాఠశాలలను ఇంటర్ కళాశాలలుగా ఉన్నతీకరించారు. వసతి, భోజన, ఇతర సౌకర్యాలు ఈ కళాశాలల్లో లభించడంతో విద్యార్థులు గురుకులాల కళాశాలల్లో చేరేందుకే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకం ప్రవేశ పెడితే బాగుండేది.

# స్థాయి పెరిగినా సమస్యలు తగ్గలే

జమ్మికుంట : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో 16 నెలల క్రితం జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిని వైద్య విధాన పరిషత్ పరిధిలోకి మార్చారు. ఆసుపత్రి స్థాయిని 30 పడకలకు పెంచినా.. వైద్య నిపుణులు, సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించలేదు. క్షేత్రస్థాయిలో రోగులకు ఇబ్బందులు తప్పటం లేదు. పలువురు సిబ్బంది డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. రోజూ 200 పైగా అవుట్ పేషెంట్లు వస్తుండగా.. ఇక్కడి సిబ్బందిని ఇతర ప్రాంతాల ఆసుపత్రులకు డిప్యుటేషన్‌పై పంపించటంతో ఉన్న సిబ్బందికి వైద్య సేవలు అందించటం పరీక్షగా మారింది. ఆసుపత్రిలో 8 మంది వైద్యులున్నా రోజూ వారీగా విధులకు ఎవరు వస్తారో రారో తెలియని పరిస్థితి. ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యుల వివరాలతో బోర్డును ప్రదర్శించకపోవటం గమనార్హం.

డిప్యుటేషన్లు, బదిలీలతో తంటాలు

జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో 8 మంది వైద్యుల్లో హుజూరాబాద్ ప్రాంతీయ ఆసుపత్రి నుంచి ఆసుపత్రి పర్యవేక్షకుడిని తొమ్మిది నెలల క్రితం డిప్యుటేషన్‌పై స్థానిక ఆసుపత్రిలో నియమించారు. హుజూరాబాద్ ప్రాంతీయ ఆసుపత్రి గైనకాలజిస్ట్‌ను ఏడు నెలల క్రితం హుజూరాబాద్ ప్రాంతీయ ఆసుపత్రి నుంచి స్థానిక ఆసుపత్రిలో డిప్యుటేషన్‌పై నియమించారు. అనస్థీషియా లేకపోవటంతో ప్రైవేట్ మత్తు వైద్యుడిని పిలిపించి ప్రసవానికి ఆసుపత్రి నిధుల నుంచి ఫీజు చెల్లిస్తున్నారు. వ్యాధి నిర్ధారణకు ఒక్కరే ల్యాబ్ టెక్నీషియన్ విధులు నిర్వర్తిస్తున్నారు. రోజులో 50 నుంచి 60కి పైగా రక్త నమూనాలు వస్తుండగా పరీక్షలు చేస్తున్నారు. ఒక్కరే ల్యాబ్, రికార్డుల నిర్వహణ, రక్త నమూనాల సేకరణ చేస్తుండటంతో ఫలితాలు ఆలస్యంగా వస్తున్నాయి. కొన్ని నమూనాలను ఇక్కడి నుంచి కరీంనగర్ హబ్‌కు పంపించటం ఇబ్బందిగా మారింది. ఏడు మాసాల క్రితం ఎన్‌సీడీ కింద పని చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్‌ను గంగాధరకు డిప్యుటేషన్‌పై



పంపించటంతో ఇబ్బందులు మొదలయ్యాయి. దంత వైద్య నిపుణురాలు, పిల్లల వైద్య నిపుణుడు, ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు ఉన్నా.. ఆసుపత్రిలో సంబంధిత వ్యాధులకు అవసరమైన సౌకర్యాలు లేక వీరు కేవలం ఓపీ పేషెంట్లకు వైద్య పరీక్షలు చేస్తున్నారు.

ఆసుపత్రిలో శిథిలమైన వంట గదిలో శవ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆసుపత్రికి కేటాయించిన ఫ్రీజర్లు ఏడు మాసాలుగా పని చేయటం లేదు. గదిలో విద్యుత్తు సౌకర్యమూ లేదు.

ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ నిపుణుడున్నా ఎక్స్‌రే అందుబాటులో లేదు. సీబీపీ పరికరం ఉన్నా అవసరమైన రక్త పరీక్షకు వినియోగించే రసాయనిక పదార్థాలు లేక నిరుపయోగంగా ఉన్నాయి.

సర్దుబాటు చేసి సిబ్బందిని నియమిస్తాం– డాక్టర్ కృష్ణప్రసాద్, డీసీహెచ్ ఎస్, సూపరింటెండెంట్, టీవీవీపీ, కరీంనగర్

జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిని వైద్య విధాన పరిషత్ పరిధిలోకి మార్చటంతో తక్కువ మంది సిబ్బందితోనే నిర్వహణ జరుగుతోంది. వైద్య విధాన పరిషత్ కమిషనర్ ఆదేశాలతో వైద్య పరిషత్, జిల్లా ఆసుపత్రి సిబ్బందిని సర్దుబాటు చేసి జమ్మికుంట ఆసుపత్రిలో త్వరలోనే నియమిస్తాం.

# తల్లిపాల మిత్ర ఆసుపత్రిగా జనగామ ఎంసీహెచ్

జనగామ : అప్పుడే పుట్టిన శిశువులకు తల్లిపాలు ఎంతో ముఖ్యం. అయితే ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రస్తుతం జరుగుతున్న కాన్పుల్లో నవజాత శిశువులకు తల్లిపాలు పట్టించడంపై అంతగా శ్రద్ధ చూపడం లేదు. దీంతో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పనపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ఏటా దేశ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ప్రసూతి ఆసుపత్రుల్లో న్యాక్ ఆధ్వర్యంలో పరిశీలన చేపడతారు. బిడ్డలకు తల్లిపాలు పట్టే విషయంలో ముందున్న ఆసుపత్రులకు 'బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లీ హాస్పిటల్'గా గుర్తింపునిస్తారు. ఈ ఏడాది కూడా దేశ వ్యాప్తంగా ప్రసూతి ఆసుపత్రుల్లో తల్లిపాలు పట్టేందుకు వసతులు కల్పిస్తూ, అవగాహన కల్పిస్తున్న పది దవాఖానలను గుర్తించారు. ఈ జాబితాలో రాష్ట్రంలోని రెండు ఆసుపత్రులు గుర్తింపు దక్కించుకున్నాయి. ఇందులో బాన్సువాడ మెటర్నిటీ ఆసుపత్రి, జనగామ ఎంసీహెచ్ ఉన్నాయి.

బీఎఫ్‌హెచ్ గుర్తింపునకు దోహదపడిన అంశాలివి..

జనగామ ఎంసీహెచ్‌లో కాన్పు అయిన బాలింతలకు తల్లిపాలు పట్టే విషయంలో ప్రత్యేకంగా గైనకాలజీ వైద్యులతో పాటు మిడ్ వైఫరీ నర్సులు అవగాహన కల్పిస్తున్నారు. నవజాత శిశువు పుట్టగానే ముర్రుపాలు తాగించాలని సూచిస్తున్నారు. ప్రసవించిన తర్వాత ఆసుపత్రిలో ఉన్న రోజుల్లో తల్లిపాలు ఇచ్చే సమయంలో బాలింతల ఇబ్బందులను గమనించి పరిష్కరిస్తున్నారు. పాలు రాకపోతే వచ్చే విధంగా పలు పద్ధతుల్లో చికిత్స అందిస్తూ, కావాల్సిన నిబ్‌లను సమకూరుస్తున్నారు. వీటితో పాటు తల్లిపాలు పట్టేందుకు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశారు. కాన్పు అయిన తర్వాత ఎంసీహెచ్‌కు పరీక్షల నిమిత్తం వచ్చే బాలింతలకు రోజూ తల్లిపాలు పడుతున్నారా అనే కోణంలో పర్యవేక్షిస్తున్నారు. ఆసుపత్రిలో తల్లిపాలు పట్టే శిశువుల వివరాలతో పక్కాగా రికార్డులను నిర్వహిస్తున్నారు. వీటన్నింటినీ న్యాక్ (నేషనల్ అక్రెడిటేషన్ కౌన్సిల్) పరిశీలించింది. తల్లిపాలు పట్టే విషయంలో



అన్ని రకాలుగా ముందున్నందున ఎంసీహెచ్‌కు దేశంలోని పది ఆసుపత్రుల సరసన చోటు కల్పించింది. దేశంలో ఎంపికైన పది ప్రసూతి వైద్యశాలల్లో జనగామ ఎంసీహెచ్ ఆసుపత్రి మాత్రమే ప్రభుత్వ పరిధిలో ఉండటం మరో విశేషం. ఉత్తమ గుర్తింపు పొందిన ఎంసీహెచ్ వైద్యులను ఇటీవల రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి అభినందించారు. ఇదే స్ఫూర్తితో పని చేయాలని సూచించారు.

అత్యాధునిక వసతులతో..

మాతాశిశు ఆరోగ్య సేవలకు గాను అత్యాధునిక వసతులతో ఐదేళ్ల క్రితం జనగామలో 200 పడకల సామర్థ్యంతో ఎంసీహెచ్ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఎస్ఎన్‌సీయూ విభాగాన్ని ఏర్పాటు చేశారు. కార్పొరేట్ ఆసుపత్రి తరహాలో అత్యాధునిక పడకలు, వెంటిలేటర్లు ఇతర వసతులు ఉన్నాయి. జిల్లా పరిధిలోని 12 మండలాల నుంచే కాకుండా పొరుగున ఉన్న సిద్ధిపేట, యాదాద్రి-భువనగిరి జిల్లాలకు చెందిన మరో ఆరు మండలాల ప్రజలకు ఎంసీహెచ్ పెద్ద దిక్కుగా మారింది. ప్రతి నెలా ఆసుపత్రిలో 350 నుంచి 400 వరకు కాన్పులు జరుగుతున్నాయి. ప్రతి రోజూ ఓపీ సేవలో 250 నుంచి 300 మంది గర్భిణులు పరీక్షలు చేయించుకుంటారు.

సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది

- డాక్టర్ సుగుణాకర్‌రాజు, ఎంసీహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్

జనగామ ఎంసీహెచ్‌లో తల్లిపాలు పట్టే విషయంలో బాలింతలకు అన్ని రకాలుగా అవగాహన కల్పిస్తున్నాం. ఇందుకోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశాం. తల్లిపాలు పట్టే శిశువుల వివరాలను రికార్డుల్లో నమోదు చేస్తున్నాం. న్యాక్ బృందం సభ్యులు.. ఆసుపత్రిలో తల్లిపాలు పట్టేందుకు కల్పించిన వసతులు, రికార్డులను పరిశీలించారు. బీహెచ్‌ఎఫ్ గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో ఎంసీహెచ్ మాత్రమే ప్రభుత్వ వైద్యశాలల కేటగిరీలో ఉంది. వైద్యులు, సిబ్బంది సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది.

# కరెంటు సరఫరా లేక రోగుల అవస్థలు

జనగామ : నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి శుక్రవారం విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో రోగులు నానా అవస్థలు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరఫరా లేకున్నా వైద్యులు, సిబ్బంది పట్టించుకోలేదని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆసుపత్రి ఆవరణలో ఉన్న విద్యుత్తు నియంత్రిక తీగ కాలిపోవడంతో సరఫరా నిలిచిపోయిందని సిబ్బంది తెలిపారు. ఉదయం సమస్య తలెత్తగా మధ్యాహ్నం 3 గంటలకు మరమ్మతులు చేపట్టడం పట్ల రోగులు, వారి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో ఉన్న రెండు జనరేటర్ల నుంచి అత్యవసర వార్డు, లేబర్ రూమ్, శస్త్ర చికిత్సల



థియేటర్, డయాలసిస్ వార్డులకు కనెక్షన్ ఉంది. మిగిలిన వార్డులకు ఆ సౌకర్యం లేనందున రోగులు, చిన్న పిల్లలు, బాలింతలు ఎదుర్కొన్న ఇక్కట్లు వర్ణనాతీతం. భాజపా నాయకులు జగన్, సందీప్, రాజు తదితరులు ఆసుపత్రిని సందర్శించి సిబ్బందిని ప్రశ్నించారు. బాలింతలు, చిన్న పిల్లల వార్డులకు జనరేటర్ కనెక్షన్ ఇవ్వకుండా వైద్యులు, నర్సింగ్ సూపరింటెండెంట్ గదులు, ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయానికి కనెక్షన్ తీసుకుని రోగులను విస్మరించారని వారు ఆరోపించారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ గోపాల్ వద్ద ప్రస్తావించగా.. రెండు జనరేటర్లతో అత్యవసర వార్డులు, డయాలసిస్, ఆపరేషన్ థియేటర్ నడిపించామన్నారు. మరమ్మతులు చేయించి కరెంటు సరఫరాను పునరుద్ధరించినట్లు చెప్పారు.

# ప్రయోగం తుస్... నైపుణ్యం నిల్!



కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలు పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్నాయి. త్వరగా ఉపాధి అవకాశాలు లభిస్తుండటంతో ఐటీఐ విద్యకు డిమాండ్ ఉంది. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు మానవ వనరులను తీర్చిదిద్దటం ఐటీఐ కళాశాలల ప్రత్యేకత. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లోనూ విద్యార్థులు ప్రవేశాలు పొందుతున్నారు. ప్రతి కోర్సుకు సంబంధించి ప్రయోగాలు చేయించాల్సి ఉంటుంది. ప్రయోగ పరీక్షలో ఉత్తీర్ణత తప్పనిసరి. ఇంతవరకు బాగానే ఉన్నా.. ప్రయోగ పరికరాల కొనుగోలుకు ప్రభుత్వ కళాశాలల్లో నిధుల కొరత వేధిస్తోంది. ఐదేళ్లుగా అరకొర వసతులతో నెట్టుకురావాల్సిన పరిస్థితులు దాపురించాయి.

ఉభయ జిల్లాల్లో నాలుగు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలు, 28 ప్రైవేట్ ఐటీఐ కళాశాలలున్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో పాత పరికరాలతో ప్రయోగాలు చేయిస్తున్నారు. కొత్త పరికరాల కొనుగోలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పైసా నిధులు కేటాయించటం లేదని కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నాయి. కనీసం చిన్న వైరు ముక్క కొనలేని దుస్థితి దాపురించిందని వాపోతున్నాయి. ప్రయోగాలు చేయలేక.. నైపుణ్యం లేక ఏటా విద్యార్థులు అప్రెంటిస్‌షిప్ కోసం పోటీపడుతున్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి శిక్షణ తీసుకోవాల్సి వస్తోంది.

అందుబాటులోని కోర్సులు

ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, కోపా, టర్నర్, డీజిల్ మోటరు మెకానిక్, మెషినిస్ట్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రానిక్ మెకానిక్ డ్రాఫ్ట్‌మెన్, మెకానిక్, వెల్డర్, హెల్త్ అండ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, కట్టింగ్ డ్రెస్ మేకింగ్, మోటర్ మెకానికల్.

నేను టర్నర్ కోర్సు అభ్యసిస్తున్నా. కళాశాలలో మరమ్మతులకు గురైన పాత పరికరాలతో అధ్యాపకులు ప్రయోగాలు చేయిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ప్రయోగ పరికరాల కొనుగోలుకు నిధులు మంజూరు చేయాలి.

చంద్రగిరి రక్షిత్, విద్యార్థి, కొత్తగూడెం రుద్రంపూర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల

పరిశ్రమలకు నెలవుగా ఉన్న జిల్లాలో ఉపాధి అవకాశాలు లభిస్తాయనే ఉద్దేశంతో ఐటీఐ కళాశాలల్లో చేరుతున్నాం. మా కళాశాలలో పదకొండు కోర్సులున్నాయి. ప్రతి కోర్సు విద్యార్థులూ ప్రయోగాలు చేయాల్సి ఉంటుంది. ప్రయోగ పరికరాల లేమితో ఇబ్బందులు పడుతున్నాం.

తాటికొండ కల్పన, విద్యార్థిని, కొత్తగూడెం రుద్రంపూర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల

ప్రభుత్వం 2018 వరకు దశల వారీగా నిధులకు కోత పెడుతూ వచ్చింది. ఐదేళ్లుగా ప్రయోగ పరీక్షలకు అసలు నిధులు మంజూరు కావడం లేదు. గోనెల రమేశ్, ఐటీఐ విద్య జిల్లా నోడల్ అధికారి, భద్రాద్రి కొత్తగూడెం

# ఎన్నాళ్లీ నిరీక్షణ..?



ఖమ్మం : వాహన చోదకుల్లో శిక్షణ నైపుణ్యాలు పెంచాలనే ఉద్దేశంతో అత్యాధునిక హంగులతో ఐడీటీఆర్(ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్) కేంద్రాన్ని ఖమ్మంలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఐడీటీఆర్ కేంద్రం నిర్మాణానికి గ్రహణం వీడటం లేదు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు విడుదలై రెండున్నరేళ్లు దాటినా నేటికీ పనుల్లో మాత్రం పురోగతి ఎక్కడా కన్పించడం లేదు. ప్రధానంగా జిల్లా కేంద్రం సమీపంలో స్థలం దొరక్కపోవడంతో ప్రాజెక్టు నిర్మాణానికి ముందడుగు పడటం లేదు. ఏడాదిన్నర కిందట ఖమ్మం నగర శివారు సమీపంలో రవాణా శాఖ అధికారులు స్థలం పరిశీలించినప్పటికీ అది అనువుగా లేదు. దీంతో రాష్ట్ర రవాణాశాఖ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డ్రైవింగ్ శిక్షణ ప్రాజెక్టు కోసం వాహనదారులు నిరీక్షించక తప్పడం లేదు.

సిరిసిల్లలో గత ఏడాది...

తెలంగాణలో తొలి ఐడీటీఆర్ ప్రాజెక్టు సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్మితమై గత ఏడాది ప్రారంభించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చొరవతో ఖమ్మం జిల్లాలో రెండో కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆధునిక హంగులతో కేంద్రం నిర్మాణానికి రూ.20 కోట్లు ఖర్చవుతుందని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో భవన నిర్మాణాలకు రూ.14 కోట్లు, సిమ్యూలేటర్‌కు రూ.3 కోట్లు, వర్క్‌షాప్ నిర్వహణకు రూ.1.50 కోట్లు, ఇతర అభివృద్ధి పనులకు రూ.1.50 కోట్ల చొప్పున ప్రతిపాదనలు రూపొందించారు. కేంద్రం ఏర్పాటుకు ప్రధాన రహదారికి 200 మీటర్ల సమీపంలో 10-15 ఎకరాల స్థలం అవసరం అవుతుందని జిల్లా రవాణా శాఖ అధికారులు గుర్తించారు. ఇందుకు సంబంధించి ఖమ్మం నగర శివారు దానవాయిగూడెం సబ్ జైలు సమీపంలో ఏడాదిన్నర కిందట ఓ ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. కానీ అది ట్రాక్ నిర్మాణానికి అనువుగా లేకపోవడం, స్థలం తక్కువగా ఉండటంతో మరోచోట స్థలం అప్పగించాలని రెవెన్యూ శాఖతో పాటు జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. నాటి నుంచి రెండున్నరేళ్లు అవుతున్నా ముందడుగు పడలేదు. ఖమ్మం జిల్లా కేంద్రానికి సమీపంలో 15 ఎకరాల ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో ఇబ్బందికరంగా మారిందని జిల్లా రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. స్థలం దొరికిన వెంటనే ఐడీటీఆర్ కేంద్రం నిర్మాణ పనులు ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొంటున్నారు.

ఐడీటీఆర్ అంటే..?

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు పొందాల్సి ఉంటుంది. ద్విచక్ర వాహనాల వరకు డ్రైవింగ్ పర్వాలేదు కానీ కార్లు, ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను నడపాలంటే కచ్చితంగా శిక్షణ అవసరం. దీంతో వాహనదారులు ప్రైవేటు కారు, ఇతర వాహనాల డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలను ఆశ్రయిస్తుంటారు. ఇక్కడ సరిగ్గా శిక్షణ లేకుండా, డ్రైవింగ్‌లో మెలకువలు నేర్చుకోకుండానే వాహనాలను రోడ్లపై నడిపేస్తుంటారు. ఫలితంగా రోడ్డు ప్రమాదాలకు కారకులవుతున్నారు. దీన్ని నియంత్రించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో వాహనదారులకు సరైన శిక్షణ అందించేందుకు జాతీయ రహదారుల శాఖ అనుమతితో ఖమ్మం జిల్లాలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్(ఐడీటీఆర్) కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ శిక్షణ కేంద్రంలో వాహనాలు నడిపేందుకు అవసరమైన అత్యాధునిక ట్రాక్‌ను నిర్మిస్తారు. నిష్ణాతులైన డ్రైవర్లు శిక్షకులుగా థియరీ క్లాసులు బోధించడం, ప్రాక్టికల్‌గా డ్రైవింగ్‌లో మెలకువలను అధికారుల సమక్షంలో అభ్యర్థులకు నేర్పిస్తారు. ట్రాఫిక్ నిబంధనలు సక్రమంగా పాటించడం, వాహనాల మరమ్మతులు, నిర్వహణ వంటి అంశాలతో పాటు సిమ్యూలేటర్‌పై స్టీరింగ్ నియంత్రణ, డ్రైవింగ్ మార్జిన్ చూసుకోవడంలో తర్ఫీదు ఇస్తారు. వయసుతో సంబంధం లేకుండా డ్రైవింగ్ లైసెన్సులకు దరఖాస్తు చేసుకున్న వారందరూ ఇక్కడ శిక్షణ తీసుకునేందుకు వీలుంటుంది. శిక్షణ పూర్తయి డ్రైవింగ్‌లో మెలకువలను నేర్చుకున్న అనంతరం రవాణా శాఖ నుంచి డ్రైవింగ్ లైసెన్సును జారీ చేస్తారు.

వాహనదారులకు ఎంతో మేలు: - తోట కిషన్‌రావు, ఖమ్మం జిల్లా రవాణాశాఖాధికారి రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాహనదా రులకు శిక్షణ ఇచ్చేందుకు జిల్లాలో ఐడీటీఆర్ కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించాయి. ఇది అందుబాటులోకి వస్తే వాహనదారులకు ఎంతో మేలు జరుగుతుంది. నిర్మాణానికి స్థల సేకరణ ప్రధాన సమస్యగా మారింది. ప్రధాన రహదారికి 200 మీటర్ల దూరంలో 10-15 ఎకరాల్లో స్థలం అవసరం. కానీ ఖమ్మం జిల్లా కేంద్రానికి సమీపంలో ఎక్కడా ప్రభుత్వ స్థలం అనువుగా లేదు. ఇప్పటికే ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు, రెవెన్యూ అధికారులకు లేఖలు రాశాం. రెవెన్యూ శాఖ అధికారులు స్థలం వెతికి రవాణా శాఖకు అప్పగిస్తే తక్షణమే ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తాం. కేంద్రం అనుమ తి ఇచ్చిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

# నిలిచిన రసాయన శుద్ధి పనులు

ములుగు :యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయ పరిరక్షణకు కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రసాయన శుద్ధి(కెమికల్ వాష్) పనులు మధ్యలోనే ఆగిపోయాయి. జనవరి రెండో వారంలో ప్రారంభమైన పనులు మార్చి వరకు కొనసాగాయి. మిగిలిపోయిన పనుల కోసం మళ్లీ ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సి ఉందని అధికారులు చర్చించుకుంటున్నారు. మళ్లీ నిధులు వచ్చే వరకు వేచి చూడాల్సిన పరిస్థితి. పురావస్తుశాఖ అధికారులు ఆలయ పైభాగంలో ఇటుకలపై ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో అందంగా తీర్చిదిద్దారు. విస్తారంగా కురిసిన వర్షాలతో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ రంగుమారడం ప్రారంభమైంది. గమనించిన అధికారులు పదేళ్లకోసారి రసాయన శుద్ధి చేయడం మొదలు పెట్టారు. దీనిలో భాగంగా మొదలైన పనులకు మార్చి గడువు అడ్డు రావడంతో పనులు అసంపూర్తిగానే ఆగిపోయాయి. ఆలయపై భాగంలోని తూర్పు, దక్షిణ, ఉత్తరం భాగాల్లో రసాయన శుద్ధి పూర్తి చేసినా పడమర భాగంలో మాత్రం చేయాల్సి ఉంది. యునెస్కో గుర్తింపు పొందిన ఆలయం విషయంలో ఇంత నిర్లక్ష్యమా అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

# మినీ బ్యాంకులుగా రేషన్ దుకాణాలు

సూర్యాపేట :మీకు ఆసరా పింఛన్ వస్తోందా.. నెలనెలా ఆ డబ్బు తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారా.. మీరు ఉపాధిహామీ పథకం కూలీలా.. మీరు చేసిన పనికి వేతనం పొందడానికి తపాలా కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందా.. ఇలాంటి కష్టాలను దూరం చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకు సేవలు అందుబాటులో లేని చోట రేషన్ డీలర్ వద్దనే పౌరసేవలు లభించేలా ఏర్పాట్లు చేసింది. ఆసక్తిగా ఉన్న రేషన్ డీలర్లకు శిక్షణ ఇస్తోంది. ంషన్ డీలర్లకు ఆదాయ మార్గం పెంపొందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే పలు దఫాలుగా వేతనాలు..ఉద్యోగ భద్రత వంటి డిమాండ్లతో వారు ఆందోళనలు చేపట్టిన ఘటనలు సైతం ఉన్నాయి. వీరి ఇబ్బందులను కొంత వరకైనా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుత పరిస్థితుల్లో పూర్తిస్థాయిలో కమీషన్ మీద ఆధారపడే అవకాశం లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గం వైపు దృష్టి సారించింది. అందులో భాగంగా చౌక ధరల దుకాణాల్లో మినీ బ్యాంక్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆ దిశగా ఇప్పటికే పౌరసరఫరాల శాఖ అధికారులు మినీ బ్యాంక్‌లపై సుముఖంగా ఉన్న డీలర్ల వివరాలు సేకరించారు. వారికి శిక్షణ ఇస్తున్నారు.



సేవల విస్తరణ

భారత తపాలా చెల్లింపుల బ్యాంకు (ఐపీపీబీ) సహకారంతో పౌరసేవలను అందించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను విస్తరించనున్నారు. ఉపాధిహామీ కూలీలకు చెల్లింపులు, ఆసరా పింఛన్ల చెల్లింపులు, నగదు జమ, తదితర సేవలు అందించేలా కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ డీలర్లకు కోఆర్డినేటర్లు అవగాహన కల్పిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో మినహాయిస్తే.. బ్యాంకింగ్ సేవలు అంతగా అందుబాటులో లేని గ్రామీణ ప్రాంతాల్లో ఇది ఉపయోగపడుతుంది. ఈ మేరకు స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్, వినియోగంపై అవగాహన ఉన్న రేషన్ డీలర్లకు శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వినియోగదారులు విద్యుత్తు, నల్ల, ఫోన్, తదితర బిల్లులను, నగదు లావాదేవీలను కొనసాగించేలా ఏర్పాట్లు చేశారు. దీంతో ప్రజలకు బ్యాంకింగ్, డిజిటల్ సేవలు మరింత సులభంగా, సౌకర్యంగా మారనున్నాయి. 0-10 సంవత్సరాల వారికి ఇక్కడ నుంచే ఆధార్ కార్డు జారీ చేయనున్నారు. ఇది పూర్తి స్థాయిలో అమలైతే అటు డీలర్లకు, ఇటు ప్రజలకు ఉపయుక్తంగా మారనుంది.

950 మందికి...

ఉమ్మడి జిల్లాలో 2506 మంది రేషన్ డీలర్లు ఉన్నారు. వీరిలో పట్టణ ప్రాంతాల్లో, సుముఖంగా లేని వారిని మినహాయిస్తే మొత్తం 950 మందికి తొలుత డిజిటల్ బ్యాంకింగ్ సేవలపై శిక్షణ అందిస్తున్నారు. తపాలా సిబ్బంది, మండల కో ఆర్డినేటర్లు ఈ సేవలపై ఇష్టంగా వారికి అవగాహన కల్పిస్తున్నారు. వారికి డిజిటల్ యంత్రాలను సైతం అందిస్తున్నారు. డీలర్లకు ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు సేవలు నిర్వహించేందుకు సర్వీస్ ప్రొవైడర్‌గా గుర్తించారు. ఈ సేవలు అందించే డీలర్లకు ప్రత్యేక కమీషన్ చెల్లించనున్నారు. ప్రతి లావాదేవీకి రూ.5 చొప్పున నెలలో రూ.5 లక్షల దాటితే రూ.11 చొప్పున కమీషన్ ఇవ్వనున్నారు. బ్యాంకులు లేని గ్రామాల్లో ఇలాంటి సేవలు ఉపయోగపడనున్నాయి.

అవగాహన కల్పించాం: పుల్లయ్య, డీఎస్‌వో, సూర్యాపేట

రేషన్ డీలర్లకు తపాలా సేవల ద్వారా ఆదాయం సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా బ్యాంకింగ్ సేవలపై ఇష్టమున్న డీలర్లకు తపాలా సిబ్బంది ద్వారా శిక్షణ అందిస్తున్నాం. ఇప్పటికే అవగాహన కల్పించాం. గ్రామీణ ప్రాంతాల్లో డీలర్లకు మేలు చేకూరుతుంది. కమీషన్ పెరిగి ఆదాయం రెట్టింపు అవుతుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం సూచిస్తోంది.

# నీటి వృథాపై.. కొత్త ప్రయోగం

సూర్యాపేట : పురపాలికల్లో తాగునీటి వృథా అరికట్టడంపై అధికారులు దృష్టిసారిస్తున్నారు. ఇళ్లలో ట్యాంకులు నిండి.. నల్లాలు సరిగా బంద్ చేయకపోవడంతో ఎక్కువగా మంచినీరు నేలపాలవుతోంది. వీటికి అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర పురపాలకశాఖ కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. ఎక్కువ నీటి వృథా జరుగుతున్న ఇళ్లను గుర్తించి.. వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా సత్ఫలితాలు రాబట్టాలని చూస్తోంది. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలో 19 పురపాలికలు ఉన్నాయి. ఒక్కో పురపాలికలో తొలుత ఐదు వార్డులు, ప్రతి వార్డుల్లో 500 ఇళ్లను ఎంపిక చేయనున్నారు. నీటి వృథాను గుర్తించిన కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు. ప్రధానంగా మురికివాడలు, శివారు ప్రాంతాలపై కన్నేయనున్నారు. జిల్లాలో రెండు, మూడు రోజుల్లో ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. వాహనాలు శుభ్రంనీటిని సరఫరా సమయంలో పట్టణాల్లో ఎక్కువగా వృథా అవుతోంది. గంటన్నర వరకు పంపిణీ జరిగితే అంతసేపూ శివారు ప్రాంతాల్లో నేలపాలవుతోంది. నీటిని పట్టుకున్న తర్వాత నల్లాలను బంద్ చేయడం లేదు. చాలామంది నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనాలు, కార్లు శుభ్రం చేసుకోవడంతోపాటు ఇంటి ఆవరణలో మొక్కలకు నీటిని పెడుతున్నారు. ఫలితంగా అన్ని ప్రాంతాల్లో సరిగా నీరందని పరిస్థితి దాపురిస్తోంది. వృథాను అరికడితే నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న కాలనీవాసులకు మళ్లించడానికి అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

పరిశీలించి.. కౌన్సెలింగ్ ఇచ్చిస్థానిక స్వయం సహాయక సంఘాల సభ్యులు, పంపు ఆపరేటర్లు, సిబ్బందితో కలిసి అధికారులు తొలుత ఎంపిక చేసిన వార్డుల్లో పర్యటిస్తారు.



# ఇంతటి క్షోభను ఎప్పుడూ అనుభవించలేదు.. ధనుంజయరెడ్డితో బాలినేని..

అమరావతి: ముఖ్యమంత్రి కార్యాలయానికి వచ్చిన ఒంగోలు ఎమ్మెల్యే , మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి సిఎంవో ముఖ్య కార్యదర్శి ధనుంజయ్ రెడ్డితో సమావేశం అయ్యారు. ఒంగోలులో భూ కబ్జా వ్యవహారంపై ఆయనతో చర్చిస్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన రాజకీయ జీవితంలో ఇంతటి క్షోభను ఎప్పుడూ అనుభవించలేదని అన్నారు. ఎమ్మెల్యేకి తెలియకుండానే భూకబ్జా జరుగుతుందా? అని ప్రజలు అనుమానిస్తున్నారని ధనుంజయ్ రెడ్డికి బాలినేని చెప్పారు. భూకబ్జా దోషులను ఎందుకు పట్టుకోవడం లేదని ప్రశ్నించారు. తన అనుచరులు ఉన్నా చర్యలు తీసుకోమని చెప్పినా ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. నిస్పాక్షికంగా వ్యవహరించాలని కలెక్టర్ , ఎస్పీలను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. ఒంగోలులో భూకబ్జా పూర్వపరాలను ధనుంజయ్ రెడ్డికి బాలినేని శ్రీనివాస రెడ్డి వివరించారు. కాగా రెండు రోజుల క్రితం ప్రకాశం జిల్లాలో పోలీసుల తీరుని నిరశిస్తూ గన్‌మెన్‌లను బాలినేని శ్రీనివాస రెడ్డి సరెండర్ చేసిన విషయం తెలిసిందే.

హైదరాబాద్ నుంచి పోలీసు ఎస్కార్ట్ వాహనం, గన్ మెన్‌లు లేకుండానే తాడేపల్లికి బాలినేని వచ్చారు. ధనుంజయ రెడ్డితో భేటీ అనంతరం సాయంత్రం 3 గంటలకు సీఎం జగన్‌ని కలిసే అవకాశం ఉంది. మంత్రి పదవి కోల్పోయినప్పటి నుంచి వైసీపీలో ప్రాధాన్యత తగ్గిందనే భావనలో బాలినేని ఉన్నారు. పార్టీలో, ప్రభుత్వ అధికారుల వద్ద తన మాటకి విలువ లేకుండా పోయిందని సన్నిహితుల వద్ద బాలినేని అసహనం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది.

# వెన్ను విరిచి వీల్ ఛైర్ ఇచ్చే రకంగా జగన్ పాలన




అమరావతి: వెన్ను విరిచి వీల్ ఛైర్ ఇచ్చే రకంగా జగన్ పాలన ఉందని, చేతివృత్తుల వారికి సొంత కాళ్లపై నిలబడే ఉపాధి ఎక్కడ?.. సంక్షేమ పథకాలు రద్దు చేసి చేదోడుతో చిల్లరివ్వడం దగా చేయడమే జగన్ నైజమని టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ.. బీసీలను అణగదొక్కి చేదోడుతో చిల్లర విదిల్చడమే తోడుగా నిలవడమా? అని ప్రశ్నించారు. చేతివృత్తుల వారికి గతంలో అందే పథకాలన్నీ రద్దు చేశారని, సబ్సిడీలు, స్వయం ఉపాధి రుణాలు రద్దు చేశారని, కార్పొరేషన్లను నిర్వీర్యం చేయడం బీసీలను ఉద్ధరించడమా? అని నిలదీశారు. టీడీపీ హయాంలో రాష్ట్ర స్థాయిలో పదవుల్లో బీసీలకు ప్రాధాన్యం ఇచ్చామని కొల్లు రవీంధ్ర అన్నారు. ప్రస్తుతం కుల కార్పొరేషన్లు తప్ప ఎక్కడా బీసీ ప్రాతినిధ్యం కనిపించడంలేదన్నారు. ఐదు జోన్లుగా విభజించి ఐదుగురు రెడ్లకు రాష్ట్రంపై పెత్తనం నిజం కాదా? అని ప్రశ్నించారు. ఆ ప్రాంతాల్లోని బీసీ మంత్రులు స్వతంత్రంగా నిర్ణయం తీసుకున్న దాఖలాలున్నాయా?.. రూ.75,760 కోట్ల సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించడం బీసీలను ఉద్ధరించడమా?.. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల రద్దుతో 16,800 పదవులు దూరం ఉద్ధరించడమా? అని నిలదీశారు. 8వేల ఎకరాల బీసీ అసైన్డ్ భూములు లాక్కున్న దుర్మార్గుడు జగన్ రెడ్డి అని, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు నాశనం చేసిందెవరు జగన్ రెడ్డీ?.. బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు సీఎం జగన్‌కు లేదన్న విషయం గుర్తుంచుకోవాలని కొల్లు రవీంధ్ర అన్నారు.



# ఇజ్రాయెల్ బలైంది వాస్తవమే.. కానీ..!

హమాస్‌పై పోరు సాగిస్తున్న ఇజ్రాయెల్‌కు తమ పూర్తి మద్దతు ప్రకటించేందుకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ టెల్ అవీవ్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ఆయన భేటీ అయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇజ్రాయెల్ దారుణంగా బలైందని (హమాస్ మిలిటెంట్ల దాడులను ఉద్దేశిస్తూ) అన్నారు. అయితే, గాజా వాసుల బాధను పోగొట్టే మార్గాలను కూడా ఇజ్రాయెల్ అన్వేషించాలని సూచించారు. ఇజ్రాయెల్ పర్యటన ముగించి బైడెన్ వాషింగ్టన్‌కు తిరుగుపయనమయ్యారు.

ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. "ప్రస్తుత పరిస్థితుల్లో ఇజ్రాయెల్ బాధిత దేశం అనేది వాస్తవం. కానీ, మరో విషయం ఏంటంటే.. గాజా నుంచి ఎటూ వెళ్లలేని అమాయక పౌరుల బాధను తీర్చే అవకాశం గనుక వారికి (ఇజ్రాయెల్‌ను ఉద్దేశిస్తూ) ఉంటే.. ఆ దిశగా చర్యలు చేపట్టాలి. ఒకవేళ అలా చేయలేకపోతే.. జరిగేదానికి వారిని బాధ్యుల్ని చేస్తారు. అది బహుశా అన్యాయమే అవుతుంది. ఇక్కడ నేను చెప్పేది ఒక్కటే.. ఒకరి బాధను తగ్గించే అవకాశముంటే.. తగ్గించాలి. లేదంటే ప్రపంచం దృష్టిలో మనం విశ్వసనీయతను కోల్పోతాం. దీన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుంటారని భావిస్తున్నా" అని అన్నారు.

**అమెరికా క్యాపిటల్‌ను తాకిన యుద్ధ సెగ..** మరోవైపు.. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధ సెగ అమెరికా క్యాపిటల్ భవనాన్ని తాకింది. హమాస్‌పై ఇజ్రాయెల్ దాడులను నిరసిస్తూ కొందరు ఆందోళనకారులు బుధవారం క్యాపిటల్ భవనాన్ని ముట్టడించారు. ఈ ఉద్రిక్తతలను ఆపేలా అమెరికా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అప్రమత్తమైన భద్రతా బలగాలు ఆందోళనకారులను అడ్డుకున్నాయి. దాదాపు 300 మంది నిరసనకారులను అదుపులోకి తీసుకున్నట్లు అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి.



# 20 రోజుల్లో 5 వరుస హత్యలు

ముంబయి: మహారాష్ట్రలోని గడ్చిరోలికి చెందిన ఇద్దరు మహిళలు ఒక కుటుంబంపై పగబట్టి ఎవరికీ అనుమానం రాకుండా అయిదుగురిని హతమార్చారు. ఈ వరుస మరణాలు అనుమానాస్పదంగా ఉండటంతో లోతుగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు హంతకుల గుట్టు రట్టు చేశారు. ఓ మహిళకు ఆ కుటుంబంతో ఆస్తి తగాదాలున్నాయి. మరో మహిళను అదే కుటుంబం వేధింపులకు గురిచేస్తోంది. దీంతో ఎలాగైనా ఆ కుటుంబాన్ని అంతమొందించాలని ఇద్దరూ కలిసి పథకం రచించారు. దాన్ని అమలుపరిచి ఇరవై రోజుల్లోనే గుట్టుచప్పుడు కాకుండా అయిదుగురి ప్రాణాలు బలి తీసుకున్నారు. గడ్చిరోలికి చెందిన సంఘమిత్ర అనే మహిళకు తన అత్తమామలు, భర్త తీరు నచ్చలేదు. రోసా అనే మరో మహిళకు ఆ కుటుంబంతో ఆస్తి తగాదాలు ఉండటంతో ఇద్దరూ చేతులు కలిపారు. రంగు, రుచి, వాసన లేని ఓ నాటుమందును సేకరించారు. సెప్టెంబరు 20న శంకర్ కుంభారే, అతని భార్య విజయ తినే ఆహారంలో దాన్ని కలిపారు. అది తిన్న తర్వాత వారికి తీవ్రమైన ఒళ్లునొప్పులు, ఆపైన గుండెనొప్పి వచ్చాయి. నాగ్‌పుర్ ఆసుపత్రిలో సెప్టెంబరు 26న శంకర్ మరణించగా.. మరుసటిరోజు అతని భార్య విజయ చనిపోయింది. ఈ ఘటనను మరువకముందే శంకర్ దంపతుల కుమార్తెలు కోమల్, ఆనంద, కుమారుడు రోషన్ అస్వస్థతకు గురయ్యారు. బంధువులు ఆసుపత్రికి తరలించగా అక్టోబరు 8న కోమల్ చనిపోగా.. 14న ఆనంద, మరుసటిరోజు రోషన్ కన్నుమూశారు. ఈ అనుమానాస్పద మరణాల్లో అందరిలోనూ అవయవాల జలదరింపు, తీవ్రమైన వెన్నునొప్పి, తలపోటు, పెదవులు నల్లగా మారడం, నాలుక మొద్దుబారడం వంటి లక్షణాలను వైద్యులు గుర్తించారు. వారంతా విషప్రభావానికి గురై ఉంటారని పోలీసులకు తెలియజేశారు. విచారణలో భాగంగా పోలీసులు తొలుత సంఘమిత్రపై నిఘా ఉంచారు. ఆమె మృతుడు రోషన్ భార్య. మరో నిందితురాలు రోసా చనిపోయిన విజయకు మరదలి వరస అవుతుంది. సమీపంలోని ఓ ఇంట్లో ఈమె నివసిస్తోంది. రోసా భర్త పూర్వీకుల ఆస్తిని విజయ, ఆమె సోదరీమణులతో పంచుకోవడంపై ఆమెకు విభేదాలున్నాయి. దీంతో సంఘమిత్రతో చేతులు కలిపింది. వీరిద్దరూ కలిసి ఆన్‌లైన్‌లో ఏదైనా విషం దొరుకుతుందేమోనని వెదికారు. ఆ తరవాత రోసా ఓ ప్రాంతానికి వెళ్లి అంతుచిక్కని పాషాణం సేకరించి తీసుకొచ్చింది. ఈ కేసులో మరో దారుణం ఏమిటంటే.. శంకర్, విజయ దంపతులను ఆస్పత్రికి తరలిస్తున్న సమయంలోనూ విషం కలిపిన నీటిని రోసా వారికి తాగించింది. అందులో ఆయుర్వేద గుణాలున్నాయని చెప్పడంతో డ్రైవరు కూడా ఆ నీటిని కొంత తాగినట్లు తెలిసింది. సంఘమిత్ర, రోసాలను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు.



# ఐబీ సిలబస్ అమలుపై సీఎం జగన్‌కు ఎందుకంత తొందర?

కాకినాడ: పేద విద్యార్థుల పేరుతో విద్యాశాఖలో బహిరంగ అవినీతికి ముఖ్యమంత్రి జగన్ తెర లేపారని జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ఆరోపించారు.

తన స్వలాభం కోసం విద్యా శాఖను అక్రమాలకు అడ్డాగా చేసుకుంటున్నారని మండిపడ్డారు. గురువారం ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ – ఐబీ (ఇంటర్నేషనల్ బెకాలారెట్) సిలబస్‌ను పాఠశాలల్లో ప్రవేశ పెట్టేందుకు చేసుకుంటున్న ఒప్పందం వైకాపా ప్రభుత్వ అవినీతికి నిదర్శనమన్నారు. కాకినాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో నాదెండ్ల మాట్లాడారు. "పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించేందుకు మొన్నటి వరకు ఆంగ్ల మాధ్యమం అని, ఆ తర్వాత సీబీఎస్‌ఈ సిలబస్ అని మాయ మాటలు చెప్పిన సీఎం.. తాజాగా ఐబీ సిలబస్‌ను బలవంతంగా విద్యార్థులపై రుద్దేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ ఐబీ కరికులమ్ ప్రపంచంలో కేవలం 4 వేల పాఠశాలల్లో మాత్రమే అమలవుతున్న విధానం. దేశం మొత్తం మీద కేవలం 212 పాఠశాలల్లో మాత్రమే ఐబీ సిలబస్ అమలవుతోంది.

అలాంటి సిలబస్‌ను రాష్ట్రంలోని 40వేలకు పైగా ప్రభుత్వ స్కూల్స్ లో అమలు చేయడం ఏంటి? అన్ని పాఠశాల్లలో ఈ సిలబస్‌ను అమలు చేయడానికి ఎందుకంత తొందరపడుతున్నారో ప్రజలకు వివరించాలి. మిడిమిడి జ్ఞానంతో ఉన్న ఈ సీఎం.. అసలు ఐబీ సిలబస్ వల్ల పేద విద్యార్థులకు ఏం ప్రయోజనమో కూడా చెప్పాలి. విద్యా వ్యవస్థను నాశనం చేయడానికి వైకాపా ప్రభుత్వం ప్రణాళిక వేస్తున్నట్లు కనిపిస్తోంది" అని నాదెండ్ల విమర్శించారు.



# నా భద్రతపై అనుమానాలున్నాయ్

విజయవాడ: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టైన తెదేపా అధినేత చంద్రబాబు జ్యుడీషియల్ రిమాండ్‌ను ఏసీబీ కోర్టు పొడిగించింది. గతంలో విధించిన రిమాండ్ నేటితో ముగియడంతో జైలు అధికారులు చంద్రబాబును వర్చువల్‌గా కోర్టు జడ్జి ఎదుట హాజరుపరిచారు. అనంతరం రిమాండ్‌ను నవంబర్ 1 వరకు పొడిగిస్తున్నట్లు న్యాయస్థానం వెల్లడించింది. జైలులో తన భద్రత విషయంలో అనుమానాలున్నాయని చంద్రబాబు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అనుమానాలుంటే రాత పూర్వకంగా ఇవ్వాలని ఆయనకు జడ్జి సూచించారు. చంద్రబాబు రాసే లేఖను తనకు అందివ్వాలని జైలు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా చంద్రబాబు ఆరోగ్యంపై జడ్జి ఆరా తీశారు. ఆయన మెడికల్ రిపోర్టులను అందివ్వాలని ఆదేశించారు.

**లీగల్ ములాఖత్ రోజుకు మూడుసార్లు ఇవ్వాలి: చంద్రబాబు న్యాయవాదుల పిటిషన్** – రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ములాఖత్‌లు పెంచాలని తెదేపా అధినేత చంద్రబాబు తరఫు న్యాయవాదులు విజయవాడలోని ఏసీబీ కోర్టును కోరారు.

ఈ మేరకు పిటిషన్ దాఖలు చేశారు. లీగల్ ములాఖత్ రోజుకు మూడు సార్లు ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషన్లపై చంద్రబాబుతో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ములాఖత్ ఇవ్వకుండా జైలు అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని న్యాయవాదులు పిటిషన్‌లో పేర్కొన్నారు.

# చంద్రబాబు బెయిల్ పిటిషన్.. విచారణ వెకేషన్ బెంచ్‌కు బదిలీ




అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెదేపా అధినేత చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ వెకేషన్ బెంచ్‌కు బదిలీ అయింది. బెయిల్ పిటిషన్‌పై విచారణను వెకేషన్ బెంచ్‌కు బదిలీ చేయాలని చంద్రబాబు తరఫు న్యాయవాదులు కోరారు. వాదనల అనంతరం చంద్రబాబు తరఫు న్యాయవాదుల అభ్యర్థనకు హైకోర్టు అంగీకరించింది. దీంతో బెయిల్ పిటిషన్‌పై దసరా సెలవుల్లో హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ చేపట్టనుంది. చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై గురువారం హైకోర్టులో విచారణ జరిగింది. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోర్టును ఆయన తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కోరారు.

ఈ కేసులో ఇతర నిందితులు బెయిల్‌పై ఉన్నారని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. గడిచిన 40 రోజులుగా దర్యాప్తులో ఎలాంటి పురోగతి లేదని పేర్కొన్నారు. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోర్టును కోరారు. చంద్రబాబు ఆరోగ్యంపై తాజా పరిస్థితి తెలుసుకునేందుకు మధ్యాహ్నం వరకు సమయం ఇవ్వాలని కోర్టును ఏఏజీ కోరారు. మధ్యాహ్నం మరోసారి వాదనలు విన్న ధర్మాసనం.. విచారణను వెకేషన్ బెంచ్‌కు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిపై హైకోర్టులో ఐఏ పిటిషన్ దాఖలైంది. ఐఏ పిటిషన్‌పైనా విచారణను వెకేషన్ బెంచ్ చేపడుతుందని జడ్జి తెలిపారు. వెంటనే చంద్రబాబు ఆరోగ్య నివేదికను వెకేషన్ బెంచ్‌కు ఇవ్వాలని రాజమహేంద్రవరం జైలు అధికారులను ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది.

# సామాజిక న్యాయ బస్సు యాత్ర నిర్వహిస్తాం...




అనంతపురం: రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం అనంతపురంలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా అనంతపురం, సత్యసాయి జిల్లాల ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇంచార్జ్‌లు, నియోజకవర్గ పరిశీలకులతో భేటీ అయ్యారు. సామాజిక న్యాయ బస్సు యాత్ర –వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహణపై మంత్రి సమీక్ష చేశారు. కార్యక్రమాలను ప్రజల్లోకి పూర్తి స్థాయిలో తీసుకెళ్లేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు సామాజిక న్యాయ బస్సు యాత్ర నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాలను మూడు ప్రాంతాలుగా విభజించి షెడ్యూల్ ఖరారు చేశామన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి నవంబర్ 9 వరకు 7 రాయలసీమ జిల్లాల్లో 7 సమావేశాలు నిర్వహిస్తామని మంత్రి పెద్దిరెడ్డి స్పష్టం చేశారు. ఈ నెల 26న శింగనమల నియోజకవర్గం నుంచి బస్సు యాత్ర ప్రారంభం అవుతుందన్నారు. వైసీపీ నాయకులందరూ పూర్తి స్థాయిలో శ్రమించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపిచ్చారు. 'నా బీసీ, నా ఎస్సీ, నా ఎస్టీ, నా మైనార్టీ అని జగన్ చెప్పే నినాదాన్ని ప్రజలలోకి తీసుకెళ్లాలన్నారు. గతంలో కొన్ని రాజకీయ పార్టీలు తమను వాడుకున్నాయని ప్రజలు గుర్తించారన్నారు. స్థానిక ఎమ్మెల్యేతో పాటు, జిల్లా ముఖ్యనాయకులు కూడా బస్సు యాత్రలో పాల్గొంటారని, వైసీపీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఎంత మేలు చేసిందో వివరిస్తారన్నారు. కృష్ణా జలాలపై న్యాయపోరాటం చేస్తామని మంత్రి పెద్దిరెడ్డి స్పష్టం చేశారు.

# మార్గదర్శి బ్రాంచ్‌లకు పోలీసు నోటీసులు.. సస్పెండ్ చేసిన హైకోర్టు

అమరావతి: ఏపీ ప్రభుత్వానికి హైకోర్టులో చుక్కెదురైంది. మార్గదర్శి చిట్‌ఫండ్ సంస్థకు చెందిన 3 బ్రాంచ్‌ల బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయాలన్న పోలీసు నోటీసులను ఉన్నత న్యాయస్థానం సస్పెండ్ చేసింది. చీరాల, విశాఖ, సీతంపేట బ్రాంచ్‌ల బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయాలంటూ మార్గదర్శి బ్రాంచ్ మేనేజర్లకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. పోలీసు నోటీసులను మేనేజర్లు హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. పోలీసుల నోటీసులను సస్పెండ్ చేసింది.



## లాక్మే వీక్‌ని షేక్ చేసిన కియరా

జెన్ Z స్టార్లలో ఒకరైన కియారా అద్వానీ తన నటనతోనే కాకుండా మంత్రముగ్ధులను చేసే రూపంతోను యువతరంలో పాపులరైంది. అతి తక్కువ వ్యవధిలో హిందీ సినిమాల్లో భారీ విజయాన్ని అందుకున్న నటిగా కియరా పేరు మార్మోగుతోంది. అగ్ర దర్శకనిర్మాతలకు కియరా ఒక కీలక ఆప్షన్ గా నిలిచింది. కియారా ప్రస్తుతం ముంబైలో కొనసాగుతున్న లాక్మే ఫ్యాషన్ వీక్ 2023లో కనిపించి షో స్టాపర్ గా నిలిచింది. ఈవెంట్ 4వ రోజున, కియారా ఫల్గుణి షేన్ పీకాక్‌కి షోస్టాపర్‌గా కనిపించింది. ర్యాంప్ పై నలుపు-బంగారు రంగులో ఉన్న బాడీకాన్ గౌనును ధరించి క్యాట్ వాక్ చేసింది. లాక్మే ఫ్యాషన్ వీక్ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్ కియరా ఫోటోలు, వీడియోలను షేర్ చేసింది. నెటిజనులు కియరా స్టన్నింగ్ లుక్ కి స్పెల్ బౌండ్ అయిపోవడం విశేషం. కియారా ఫల్గుణి షేన్



పీకాక్ కోసం ర్యాంప్ వాక్ చేయడం ఇదే మొదటిసారి కాదు. ఈ సంవత్సరం జూలైలో, ఇండియా కోచర్ వీక్ 2023లో షోస్టాపర్‌గా కనిపించారు. స్టన్నింగ్ కియరా స్టైలిష్ లుక్స్ .. అందంగా డిజైన్ చేసిన దుస్తులతో ర్యాంప్‌ను అలంకరించిన కియరా యూత్ హార్ట్ త్రోబ్ గా మారింది. ఇప్పుడు లాక్మే వీక్ లోను ఎంతో స్పెషల్ లుక్ తో ఆకట్టుకుంది. వ్యక్తిగతంగా కియరా తన ప్రియుడు, హీరో సిద్ధార్థ్ మల్హోత్రాని పెళ్లాడిన సంగతి తెలిసిందే. వృత్తిరీత్యా 31 ఏళ్ల కియరా వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. కార్తీక్ ఆర్యన్‌తో కలిసి సత్యప్రేమ్ కి కథలో చివరిగా కనిపించిన ఈ బ్యూటీ మరో రూ.100 కోట్ల క్లబ్ సినిమాని తన ఖాతాలో వేసుకుంది. ఈ చిత్రం కమర్షియల్ హిట్‌గా నిలిచింది. తదుపరి రామ్ చరణ్ సరసన శంకర్ దర్శకత్వంలో గేమ్ ఛేంజర్ అనే పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ లో నటిస్తోంది. ఇందులో ఎస్ జె సూర్య, జయరామ్, సునీల్, శ్రీకాంత్, సముద్రఖని సహాయక పాత్రల్లో నటిస్తున్నారు. ఇది 2025లో సినిమా థియేటర్లలో విడుదల కానుంది. జూనియర్ ఎన్టీఆర్ - హృతిక్ రోషన్-స్టార్ వార్ 2 లో కూడా కియరా కాథానాయికగా నటించనుంది.

## సాయి పల్లవి ఆనందం ఆత్రుత...!

ఫిదా చిత్రంతో తెలుగు ప్రేక్షకులను ఫిదా చేసిన ముద్దుగుమ్మ సాయి పల్లవి టాలీవుడ్ తో పాటు కోలీవుడ్ ఇతర భాషల్లో కూడా మంచి ఫాలోయింగ్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. సాయి పల్లవి ఈ మధ్యకాలంలో కాస్త సినిమాల ఎంపిక విషయంలో అశ్రద్ధ చూపిస్తుందంటూ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వచ్చిన మంచి ఆఫర్స్ చేజేతులా వదులుకొని చిన్న చితక సినిమాల్లో నటిస్తోంది అంటూ కొందరు ఈమెని ట్రోల్ చేస్తున్నారు. ఎట్టకేలకు ఈమె మళ్లీ సౌత్ తో పాటు ఇతర భాషల్లో బిజీ అయ్యేందుకు సినిమాలు కమిట్ అయింది. ముందు ముందు మరిన్ని సినిమాలతో సాయి పల్లవి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇక దేశం మొత్తం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న రామాయణం సినిమాలో సీత పాత్రకి సాయి పల్లవి ఎంపిక అయింది. ప్రముఖ దర్శకుడు నితీష్ తివారి దర్శకత్వంలో భారీ బడ్జెట్ తో రూపొందబోతున్న రామాయణం సినిమా కాస్టింగ్



ఎంపిక జరుగుతుంది. అందులో భాగంగా దర్శకుడు ఇటీవల సాయి పల్లవిని సంప్రదించాడని.. త్వరలోనే కథ చెప్పబోతున్నాడని వార్తలు వస్తున్నాయి. ఆ ప్రాజెక్టు విషయం సాయి పల్లవి తాజాగా క్లారిటీ ఇచ్చింది. దర్శకుడు నితీష్ తివారి తనకు ఈ ఛాన్స్ ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది.. సీత పాత్రను ఇప్పటి వరకు ఎంతో మంది గొప్ప హీరోయిన్స్ పోషించారు. వారు కనబరిచిన నటనలో తాను పది శాతం కనబరిచిన కూడా విజయం సాధించినట్లే.

కనుక తాను ఆ 10 శాతం నటనను ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తాను అన్నట్లుగా సాయి పల్లవి చెప్పుకొచ్చింది. హీరోయిన్గా సాయి పల్లవి ఇప్పుడు వరకు భిన్నమైన పాత్రలో కనిపించింది అయితే సీత పాత్ర అనేది కచ్చితంగా మనకు ఒక ఛాలెంజింగ్ రోల్.. అంతే కాకుండా ఆమె స్థాయిని చూపించగల సినిమా అవుతుంది అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సాయి పల్లవి రామాయణం సినిమాలో ఛాన్స్ రావడం పట్ల చాలా ఆనందంతో కనిపిస్తోంది. అంతే కాకుండా ఏప్పుడప్పుడు సినిమా షూటింగ్ ప్రారంభం అవుతుందా అంటూ ఆత్రుతగా ఎదురు చూస్తోంది. రామాయణం సినిమా రావడానికి మరో రెండు మూడు సంవత్సరాలు పట్టే అవకాశం ఉందని గుసగుసలు వినిపిస్తున్నాయి. అప్పటి వరకు సాయి పల్లవి ఫ్యాన్స్ కాస్త ఓపిక పట్టాల్సిందే ,




## టీజర్: సైకో సైంధవ్.. ఊచకోత




విక్టరీ వెంకటేష్ హై వోల్టేజ్ యాక్షన్ సినిమాలు చేసి చాలా కాలం అయ్యింది. అయితే ఈసారి అతని నుంచి రాబోతున్న సైంధవ్ సినిమా మాత్రం అంతకుమించి అనేలా ఉండబోతున్నట్లుగా తెలుస్తోంది. ఫ్యామిలీ ఆడియన్స్ లో మంచి గుర్తింపు అందుకున్న వెంకటేష్ కు అలాగే మాస్ ప్రేక్షకుల్లో కూడా ఎల్లప్పుడూ అంచనాలు గట్టిగానే ఉంటాయి. పర్ఫెక్ట్ గా ఈ రెండు ఎమోషన్స్ ను హ్యాండిల్ చేయగలిగితే బాక్సాఫీస్ వద్ద ఇండస్ట్రీ హిట్ కూడా చూడవచ్చు. కానీ ఇప్పటివరకు ఏ దర్శకుడు ఆ రేంజ్ లో ఆకట్టుకోలేదు. కానీ ఇప్పుడు శైలేష్ కొలను మాత్రం వెంకటేష్ ను తనదైన శైలిలో ప్రజెంట్ చేసే ప్రయత్నం అయితే చేస్తున్నాడు. వెంకటేష్ 75వ సినిమాగా రూపొందుతున్న సైంధవ్ సినిమా సంక్రాంతి జనవరి 13న రాబోతోంది. ఇక సినిమాకు సంబంధించిన టీజర్ను విడుదల చేశారు. టీజర్ లో వెంకటేష్ ఒక పవర్ఫుల్ హీరోగా కనిపిస్తున్నాడు. ఇక విలన్స్ దృష్టిలో మాత్రం అతను సైకోగా ప్రజెంట్ చేశారు. చిన్నపిల్లలను ఉగ్రవాదులుగా తయారు చేసే ఒక ముఠాలో ఎదిరించే వ్యక్తిగా సైంధవ్ కనిపించబోతున్నాడు. అయితే సైంధవ్ సీక్రెట్ ఏజెంటా? లేక అతన్ని స్పెషల్ ఆఫీసర్ గా చూపించబోతున్నారా అనేది సినిమాలో చూడాలి. కానీ హ్యాపీగా ఫ్యామిలీ తో ఉన్న ఒక వ్యక్తి మళ్లీ ఒక ఉగ్రవాదుల మిషన్ ను ఎదిరించేందుకు వచ్చినట్లుగా తెలుస్తోంది. ఈ సినిమాలో ఉగ్రవాదుల ప్లాన్ ను హ్యాండిల్ చేసే వ్యక్తిగా నవాజుద్దీన్ కనిపించబోతున్నాడు. ఇక అతని ప్లాన్స్ ని ఎదిరించే సైంధవ్ ఏ విధంగా తన సైకోతనాన్ని చూపించాడు అనేది టీజర్ లో పవర్ఫుల్ గా హైలెట్ చేశారు. చూస్తుంటే సినిమాలో యాక్షన్ ఎలిమెంట్స్ లో ఊచకోత గట్టిగానే ఉండబోతున్నట్లుగా అనిపిస్తుంది. వెంకటేష్ గతంలో ఎప్పుడు లేనంత ఘోరంగా ఈ సినిమాలో విలన్స్ పై దాడి చేయబోతున్నాడు. ఇక ఈ సినిమాలో కూతురిని ఎమోషన్ కూడా హైలెట్ కాబోతోంది. అలాగే ఉగ్రవాదులు అనే పాయింట్ ను కూడా దర్శకుడు హైలెట్ గా చూపించబోతున్నారు. మొత్తానికి ఒకవైపు కూతురు ఏమోషన్ మరొకవైపు ఉగ్రవాద ముఠాను ఎదిరించి సైంధవ్ టీజర్ తో మెప్పించాడు. మరి సినిమా ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

## 160కోట్లు సంపాదించిన యువహీరో




'రంగ్ దే బసంతి' భారతదేశంలోని అత్యంత ప్రజాదరణ పొందిన కల్ట్-క్లాసిక్ సినిమాలలో ఒకటి. ఈ సినిమా ప్రధాన నటుల్లో ఒకరు ఇప్పుడు విజయవంతమైన వ్యాపారవేత్త. అమీర్ ఖాన్ సహనటుడు కునాల్ కపూర్ కొన్నేళ్ల క్రితం తన సొంత కంపెనీని స్థాపించాలని నిర్ణయించుకున్నాడు. అతడు బాలీవుడ్ నటుడిగా కంటే ఎక్కువ విజయాన్ని సాధించాడు. అమీర్ ఖాన్ - శర్మన్ జోషితో కలిసి 'రంగ్ దే బసంతి'లో అస్లాం పాత్రను పోషించిన కునాల్ కపూర్, నటనకు స్వస్తి చెప్పి విజయానికి తనదైన మార్గాన్ని ఏర్పరచుకోవాలని నిర్ణయించుకున్నాడు. నిజానికి ఇది చాలా మందికి తెలియదు. కానీ పాపులర్ క్రౌడ్-ఫండింగ్ ప్లాట్‌ఫారమ్ కెట్టో వెనుక ఉన్న వ్యక్తి కపూర్. ఒక వ్యవస్థాపకుడు-పెట్టుబడిదారుగా మారిన కునాల్ కపూర్ కెట్టో సహ వ్యవస్థాపకుడు. ఇది విస్తృతంగా జనాదరణ పొందిన క్రౌడ్-ఫండింగ్ ప్లాట్‌ఫారమ్. ఇది అనేక సామాజిక కారణాల కోసం.. సంఘంలోని దురదృష్టవంతుల కోసం డబ్బును సేకరించే వేదిక. వ్యాపార భాగస్వాములైన జహీర్ అడెన్‌వాలా- వరుణ్ శేత్‌లతో కలిసి కునాల్ కపూర్ 2012లో కెట్టోను స్థాపించారు. 'రంగ్ దే బసంతి' విస్తృత విజయం కునాల్ కపూర్‌కు బాలీవుడ్ ప్రపంచంలో ఇమేజ్ ని పెంచినా కానీ..ఆ తర్వాత కొన్ని చిన్న హిట్‌ల తర్వాత తన ఆలోచనను మార్చుకున్నాడు. పరిశ్రమ నుండి కొంత విరామం తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. కపూర్‌కు వ్యవస్థాపక రంగంపై మక్కువ ఉంది. NGOలలో చురుకైన దాత. ఇది అతన్ని కెట్టోను కనుగొనేలా ప్రేరేపించింది. కునాల్ కపూర్ మొదటి వ్యవస్థాపక వెంచర్ అతడు కేవలం 16 సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు అతను పెరుగుతున్న డిమాండ్ మధ్య హాంకాంగ్‌కు మామిడిని ఎగుమతి చేయడానికి ప్రయత్నించాడు. ఆ తర్వాత కెట్టో అతడికి పెద్ద విజయం. కెట్టో అనేది కునాల్ కపూర్ రెండవ వ్యాపార ఆలోచన. పెట్టుబడిదారుల భాగస్వామ్యంతో ఇది విజయవంతమైంది. ఇప్పటి వరకు కెట్టో తన ప్లాట్‌ఫారమ్‌లో వివిధ కారణాల కోసం USD 150 మిలియన్లు (రూ. 1249 కోట్లు) సేకరించింది. స్టార్టప్ మొత్తం ఆదాయం రూ. 110 కోట్లకు పైగా ఉంది. ఇదిలా ఉండగా తాజా నివేదికల ప్రకారం నటుడు, కెట్లో సహ వ్యవస్థాపకుడు కునాల్ కపూర్ నికర ఆస్తి విలువ రూ. 166 కోట్లు.

## నాభి సొగసును ఆరాంగా చూపించేస్తోంది!

పూనమ్ బజ్వా నిరంతర ఫోటోషూట్లు అంతర్జాలాన్ని షేక్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవలి కాలంలో ఈ భామ రొటీన్ కి భిన్నంగా ట్రెండీ లుక్స్ తో కట్టి పడేస్తోంది. బికినీ..టూపీస్.. యోగా..జిమ్ముల్లో వర్కౌట్ వీడియోలు ఫోటోలతో కుర్ర కారుని హీటెక్కించే ఈ భామ పొట్టినిక్కరల్లో చెలరేగిపోవడం చూస్తున్నదే. తాజాగా అమ్మడు మరోసారి ఇన్ స్టా వేదికగా ఓ స్పెషల్ ఫోటోషూట్ ని షేర్ చేసింది. బ్లూటాప్, ఫ్లోరల్ బాటమ్ లో బజ్వా అదరగొట్టింది. ఫోటోషూట్ ఆద్యంతం రకరకాల భంగిమలతో ఫోజులిచ్చిన ఈ భామ తన నాభి అందాల్ని ఆరాంగా తెరపరిచింది. ప్రస్తుతం ఈ ఫోటోషూట్ ఇన్ స్టాలో వైరల్ గా మారింది. నాభి అందాలు..నడుము ఒంపు



సొంపుల ఎలివేషన్ మతులు చెడగొడుతోంది అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. పూనమ్ అందాలపై నెటిజనులు కామెంట్లు అంతే ఆసక్తికరం. ఇటీవల కాలంలో పూనమ్ అప్ డేట్ చూస్తుంటే ఇన్ స్టాలో యాక్టివ్ నెస్ ని స్పీడప్ చేసినట్లు కనిపిస్తోంది. ఏదో ఒక హాట్ ఫోటోషూట్ తో ఫ్యాన్స్ కి టచ్ లో ఉంటుంది. తాజాగా షేర్ చేసిన ఫోటోషూట్ లో పూనమ్ థైషోస్ మేకప్ లెస్ లుక్ పైనా రకరకాల కామెంట్లు పడిపోతున్నాయ్. పూనమ్ హాట్ గా ఉందంటూ పలువురు నెటిజనులు కామెంట్ చేసారు. పూనమ్ కెరీర్ మ్యాటర్ కి వస్తే ప్రస్తుతం మలాయళంలో పాతోన్ పాతమ్ నుట్టానుండ్ అనే ఒకే సినిమాలో నటిస్తోంది. ఇది చరిత్ర నేపథ్యంతో కూడిన సినిమా.

భారీ బడ్జెట్ తోనే తెరకెక్కిస్తున్నారు. తెలుగులో పూనమ్ మొదటి సినిమాతో నటిగా పరిచయమైంది. ఆ తర్వాత పరుగు , ఎన్టీఆర్ కథానాయకుడు చిత్రాల్లో నటించింది. అలాగే పలు మీడియం బడ్జెట్ సినిమాల్లోనూ నటించింది. కానీ ఇక్కడ అనుకున్నంత స్టార్ డమ్ చిక్కలేదు. దీంతో ఇతర భాషా చిత్రాలపై దృష్టి పెట్టింది. తమిళ్, కన్నడ భాషల్లోనూ కొన్ని సినిమాలు చేసింది. అయితే మాతృభాష హిందీలో మాత్రం ఇప్పటి వరకూ ఒక్క సినిమా కూడా చేయలేదు.

## నిహారిక.. పసిడి వర్ణంతో మెరిసిపోతూ

మెగా డాటర్ నిహారిక ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా కనిపిస్తోంది. నటిగా ఎదిగే ప్రయత్నాల్లో.. నిహారిక చేస్తున్న బోల్డ్ ఫోటో షూట్స్ బాగా వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం వెబ్ సిరీస్‌లు చేస్తూ, ఫారెన్ ట్రిప్స్‌కు వెళ్తూ..లైఫ్‌ను ఫుల్ ఎంజాయ్ చేస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా కళ్లు చెదిరే రేంజ్‌లో రెట్రో ఫొటోషూట్ చేయగా అది ఫుల్ వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. నిహారిక.. ట్రెడిషనల్‌గా ఆరెంజ్ కలర్ సిల్క్ చీరలో జాకెట్ లేకుండా.. శైలపుత్రి సంప్రదాయంలో కనిపించి ఆకట్టుకుంది. "శైలపుత్రి, పర్వతాల కూతురు. ఆరెంజ్ కలర్? ప్రకాశాన్ని, బలాన్ని, దయను రిప్రజెంట్ చేస్తుంది" అంటూ క్యాప్షన్ రాసుకొచ్చింది. ప్రాచీన కాలం నాటి కట్టడాలపై సూర్యుని కిరణాలు పడి.. వాటి నీడలు మధ్య నిహారిక కూర్చొని ఉండటం, అవే కిరణాలు ఆమె నారింజ రంగు చీరపై కూడా పడటం, ఆ వెలుగులో నిహారిక ముఖం మిలమిల మెరవడం.. అంతా చాలా బాగా కనిపించాయి. నిహారికకు మరింత



అందాన్ని తెచ్చాయి. నిహారిక బ్లౌజ్ లెస్ చీర డిజైన్ ఆమె అందాన్ని మరింత రెట్టింపు చేసింది. ఆమె ధరించిన జ్యూవెలరీ, హెయిర్‌ను లూస్‌గా వదిలేయడంతో తన ఫేస్ ఎంతో ఛార్మింగ్‌గా కనిపించింది. మొత్తంగా ఆమె రెట్రో లుక్ మెస్మరైజ్ చేసిందనే చెప్పాలి. కాగా, అంతకుముందు డార్క్ థీమ్‌తో కూడా కొన్ని అదిరే పోజుల్లో కాకరేపింది నిహారిక. ఈ ఫోటోలు కూడా బాగా వైరల్ అవుతున్నాయి. ఇకపోతే మెగా ఫ్యామిలీ నుంచి హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన నిహారిక... ఒక మనసు చిత్రంతో వెండితెరకు పరిచయమైంది. ఆ తర్వాత హ్యాపీ వెడ్డింగ్, సూర్యకాంతం సహా పలు చిత్రాల్లో నటించింది.

అవి వర్కౌట్ కాలేదు. ఈ క్రమంలోనే పెళ్లి చేసుకుంది. నిర్మాణ సంస్థ స్థాపించి భర్తతో కలిసి సినిమాలను నిర్మించింది. కానీ ఆ తర్వాత ఆమె వివాహ జీవితం సాఫీగా సాగలేదేమో విడాకులు కూడా తీసుకుని మళ్లీ కెరీర్‌పై ఫోకస్ పెట్టింది.



# తెలంగాణకు నంబర్ వన్ విలన్ కాంగ్రెస్సే

హైదరాబాద్: కాంగ్రెస్ బస్సు యాత్ర తుస్సుమనడం ఖాయమని మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. సంక్షేమంలో స్వర్ణయుగానికి కేరాఫ్ తెలంగాణ అని.. చీకటి పాలనకు కర్ణాటక చిరునామా అని విమర్శించారు. గత పదేళ్లలో గిరిజన వర్సిటీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎందుకు నోరుమెదపలేదని ప్రశ్నించారు. విభజన హామీలపై ఏనాడూ ఎన్డీఏను ప్రశ్నించని రాహుల్‌కు తెలంగాణలో పర్యటించే అర్హత లేదన్నారు. నిన్నైనా.. నేడైనా.. రేపైనా.. తెలంగాణకు నంబర్ వన్ విలన్ కాంగ్రెస్సే అని మంత్రి కేటీఆర్ ట్విటర్ (ఎక్స్) వేదికగా మండిపడ్డారు.

**కాంగ్రెస్‌ను నమ్మేదెవరు?** "కర్ణాటకలో ప్రజలకిచ్చిన హామీలన్నీ 100 రోజుల్లోనే బొందపెట్టిన పార్టీ మీది. మేనిఫెస్టోలో ఇవ్వని హామీలను కూడా నెరవేర్చిన ప్రభుత్వం మాది. రైతులకు 24 గంటలు నిరంతర ఉచిత విద్యుత్ అందిస్తూ సాగును సంబురంగా మార్చిన పాలన మాది. నమ్మి ఓటేసిన కర్ణాటక ప్రజలను నట్టేట ముంచి.. తెలంగాణలో నాటకాలకు తెరతీస్తే కాంగ్రెస్‌ను నమ్మేదెవరు? కరప్షన్‌కు కేరాఫ్ కాంగ్రెస్. కమీషన్ల కోసం కాంట్రాక్టర్లకు నిత్యం వేధింపులు.. ఇక్కడికొచ్చి నీతి వాక్యాలా? దశాబ్దాలుగా పోడు భూముల సమస్యను కోల్డ్ స్టోరేజీలో పెట్టింది మీరు. ఏకంగా 4.50 లక్షల ఎకరాల భూములు పంచి అడవి బిడ్డలకు పట్టాభిషేకం చేసిన ప్రభుత్వం మాది.

**కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ అప్పుడే మొదలైంది :** తెలంగాణ ఏర్పాటులో పదేళ్ల జాప్యమే వందల మంది బలిదానాలకు కారణం. గాంధీ భవన్‌ను గాడ్సేకు అప్పగించిన నాడే.. తెలంగాణ కాంగ్రెస్‌కు కౌంట్ డౌన్ మొదలైంది. ల్యాండ్ మాఫియాకు కేరాఫ్ మీ పీసీసీ చీఫ్. టికెట్ల కోసం రూ.కోట్ల సొమ్ముతోపాటు భూములు రాయించుకుంటున్న వ్యక్తి రేవంత్. రిమోట్ పాలన గురించి మీరా మాట్లాడేది? రిమోట్ కంట్రోల్ పాలనకు కేరాఫ్ మీ 10-జన్‌పథ్. మా ప్రభుత్వ రిమోట్ తెలంగాణ ప్రజల చేతిలో పదిలంగా ఉంది. మీ గాంధీభవన్ రిమోటే గాడ్సే చేతిలో మాడి మసైపోతోంది. 3 రోజుల పర్యటన చేసినా.. 300 రోజులు ముక్కు నేలకు రాసినా... తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మరు... ఎప్పటికీ విశ్వసించరు" అని కేటీఆర్ మండిపడ్డారు.

# మంత్రి కేటీఆర్‌కు రేవంత్ స్ట్రాంగ్ కౌంటర్




హైదరాబాద్: కాంగ్రెస్ బస్సుయాత్ర... తుస్సుమనడం ఖాయం అంటూ మంత్రి కేటీఆర్ చేసిన ట్వీట్‌కు టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కౌంటర్ ట్వీట్ చేశారు. నిస్సిగ్గు మాటలకు, ఎదురుదాడులకు కేరాఫ్ అడ్రస్ డ్రామారావు అంటూ వ్యాఖ్యలు చేశారు. 10 ఏళ్లు అధికారంలో ఉండి అంట కాగింది మోడీ – కేడీ అని.. కాంగ్రెస్ ఇచ్చిన గిరిజన యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు పరిశ్రమకు పాతర వేసింది మోడీ – కేడీ అంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్టును పాతాళానికి తొక్కింది మోడీ – కేడీ అని అన్నారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేయించలేని దద్దమ్మలం అని తమరే ఒప్పుకుంటున్నారని.. తెలంగాణకు ఈ దద్దమ్మ పాలన ఇక అవసరం లేదు అంటూ రేవంత్ ట్వీట్ చేశారు.

# రెంటు కష్టాలు తెచ్చే కాంగ్రెస్ మనకెందుకు?: ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్: కరెంటు కష్టాలు తెచ్చే కాంగ్రెస్ మనకెందుకు?అని భారాస ఎమ్మెల్సీ కవిత అన్నారు. మోసం కాంగ్రెస్ నైజమని.. ఆ పార్టీకి ఓటేస్తే కర్ణాటక గతే పడుతుందని పేర్కొన్నారు. కర్ణాటక ఎన్నికల్లో 20 గంటల కరెంటు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పుడు 5 గంటల కరెంటుతో సరిపెట్టుకోవాలని కర్ణాటక విద్యుత్ శాఖ మంత్రి కేజే జార్జ్ చెబుతున్నారన్నారు. ఆయనలానే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కూడా 3 గంటల కరెంటు చాలంటున్నారని మండిపడ్డారు. ఈ మేరకు కర్ణాటక మంత్రి వీడియోషేర్ చేస్తూ కవిత ట్వీట్ చేశారు.

# బీజేపీలో చర్చనీయాంశంగా రాజసింగ్ వ్యాఖ్యలు



హైదరాబాద్ : గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. తెలంగాణ బీజేపీలో మార్పు రావాలంటే ఆర్‌ఎస్‌ఎస్ లో ఉన్న ఆలే శ్యామ్ జీని పార్టీలో తీసుకోవాలన్నారు. ఆలే నరేంద్ర సోదరుడు శ్యామ్ జీ రాకతో తెలంగాణ బీజేపీలో మార్పు తథ్యమన్నారు. శ్యామ్ జీని పార్టీలోకి తీసుకురావటానికి కిషన్ రెడ్డి సహా.. రాష్ట్ర నేతలు కృషి చేయాలన్నారు. శ్యామ్ జీ కోసం జాతీయ నాయకత్వంతో కిషన్ రెడ్డి సహా ఇతర నేతలు మాట్లాడాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు.



# సీఎం కుర్చీని వదులుకోవడానికి సిద్ధమే కానీ..!

దిల్లీ: సీఎం పదవికోసం సహచర నేత సచిన్ పైలట్ నుంచి పోటీ ఎదురవుతోన్న వేళ.. రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం పదవి వదులుకోవడానికి సిద్ధం అంటూనే.. వదిలిపెట్టేందుకు అనాసక్తిని వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన దిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడారు. నాలుగోసారి కూడా తాను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోవాలని ఓ సందర్భంలో ఓ మహిళా కార్యకర్త కోరిన విషయాన్ని గహ్లోత్ గుర్తుచేసుకున్నారు. 'నేను సీఎం పదవిని వదులుకోవాలని అనుకుంటున్నాను. కానీ ఆ కుర్చీనే నన్ను వదలడం లేదు. అది నన్ను వదలకపోవచ్చు కూడా' అని అప్పుడు తాను ఆమెకు సమాధానం ఇచ్చినట్లు చెప్పారు.

ఈ వ్యాఖ్యలు గహ్లోత్ సరదాగా చెప్పినట్లు కనిపిస్తున్నప్పటికీ.. కాంగ్రెస్ గెలిస్తే సీఎం పోస్టు మళ్లీ తనదే అని పైలట్‌కు పరోక్షంగా వెల్లడించినట్టుగా ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. 'సోనియా గాంధీజీ కాంగ్రెస్ అధ్యక్షురాలు అయిన వెంటనే.. ఆమె తీసుకున్న మొదటి నిర్ణయం నన్ను ముఖ్యమంత్రిని చేయడమే. నేను అప్పటికీ సీఎం అభ్యర్థిని కాకపోయినా.. ఆమె నన్ను సీఎంగా ఎంపిక చేశారు' అని ఈ సందర్భంగా చెప్పారు. 2020లో గహ్లోత్ ప్రభుత్వంపై అసమ్మతితో పైలట్ తిరుగుబావుటా ఎగురవేసిన సంగతి తెలిసిందే. అప్పుడు గహ్లోత్ ప్రభుత్వం కూలిపోయే పరిస్థితులు కనిపించాయి. అయితే అధిష్ఠానం బుజ్జగింపులతో పైలట్ తన మనసు మార్చుకొని రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించడంతో కథ సుఖాంతం అయింది. అప్పటినుంచి రెండు వర్గాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. అయితే అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని ఇరు వర్గాలు చెప్తున్నాయి. ఇప్పుడు కూడా గహ్లోత్ అవే మాటలు చెప్పారు. 'మేమంతా కలిసి ఉన్నాం. నేను ఏ ఒక్కరినీ వ్యతిరేకించడం లేదు' అని స్పష్టం చేశారు. అలాగే ఎన్నికల్లో పోటీపడే అభ్యర్థుల జాబితా విడుదలలో జాప్యంపై ప్రశ్నించగా.. 'ప్రతిపక్ష భాజపా మాత్రమే ఈ జాబితాపై కలవరపడుతోంది. మేం ఘర్షణ పడటం లేదని వారు నిరాశ చెందుతున్నారు. పార్టీలో అందరి అభిప్రాయం తీసుకున్న తర్వాతే నిర్ణయాలు ఉంటాయి. నేను సచిన్ పైలట్ మద్దతుదారులతోనూ మాట్లాడుతున్నాను. నేను క్షమించు–మర్చిపో అనే మంత్రాన్ని అనుసరిస్తున్నాను(పైలట్ వర్గాన్ని ఉద్దేశించి). అలాగే మెరుగైన ప్రత్యామ్నాయం కనిపిస్తే.. సిట్టింగ్ అభ్యర్థులను మార్చుతాం' అని చెప్పారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నవంబర్ 25న రాజస్థాన్ ఎన్నికలకు వెళ్లనుంది. డిసెంబర్ మూడున ఫలితాలు వెల్లడికానున్నాయి.



# రేవంత్‌రెడ్డిపై నూతన గవర్నర్ ఇంద్రసేనారెడ్డి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్: త్రిపుర రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన నల్లు ఇంద్రసేనారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిపై ఇంద్రసేనారెడ్డి ఫైర్ అయ్యారు. రెడ్లకు తానే ప్రతినిధినని రేవంత్ రెడ్డి అనుకుంటున్నారన్నారు. గురువారం రెడ్డినైన తనకు గవర్నర్ పదవి వచ్చిందనందుకు రేవంత్ రెడ్డి బాధ పడిపోతున్నారని మండిపడ్డారు. ఎంతసేపూ ఇతరులను ఇరకాటంలో పెట్టడమే రేవంత్ రెడ్డి పని అంటూ వ్యాఖ్యలు చేశారు. సొసైటీని డివైడ్ చేసుకునేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రెడ్లకు తానే ప్రతినిధినని రేవంత్ ఓపెన్‌గా అనేకసార్లు చెప్పారన్నారు. మోదీ స్వయంగా ఫోన్ చేసి త్రిపుర గవర్నర్‌గా నియమిస్తున్నట్లు చెప్పారని.. తన సిన్సియారిటీ గురించి ఏపీ, తెలంగాణ ప్రజలకు తెలుసన్నారు. ఎవరు పనితీరు ఏంటో మోదీకి తెలుసన్నారు. ఎప్పుడు ఎవరికి ఏ బాధ్యతలు ఇవ్వాలో వారికి తెలుసని చెప్పుకొచ్చారు. గతంతో పోల్చితే మోదీ హాయాంలో ఈశాన్య రాష్ట్రాలు చాలా వేగంగా అభివృద్ధి చెందాయని నల్లు ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

**ఇంద్రసేనారెడ్డి నియామకాన్ని తప్పుబట్టిన కాంగ్రెస్ –** కాగా.. త్రిపుర రాష్ట్ర గవర్నర్‌గా నల్లు ఇంద్రసేనారెడ్డి నియామకంపై కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. సీఈసీ రాజీవ్ కుమార్‌కు పీసీసీ ఎన్నికల కమిటీ ఛైర్మన్ నిరంజన్ ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతుంటే ఇక్కడి వ్యక్తిని త్రిపుర గవర్నర్‌గా నియమించడం సరికాదని కాంగ్రెస్ పేర్కొంది. ఇది ఓటర్లను ప్రభావితం చేసే చర్య అని కాంగ్రెస్ పార్టీ తెలిపింది. గవర్నర్‌గా ఇంద్రసేనారెడ్డి నియామకాన్ని నిలిపివేయాలని సీఈసీని కాంగ్రెస్ పార్టీ కోరింది.

# మావే కేసీఆర్ కాపీ కొట్టారు.. డౌటే లేదు కాంగ్రెస్ రావడం ఖాయం



జయశంకర్ భూపాలపల్లి: కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన ఆరు గ్యారంటీలనే ముఖ్యమంత్రి కేసీఆర్ కాపీ కొట్టారని ఆ పార్టీ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి విమర్శలు గుప్పించారు. గురువారం మాట్లాడుతూ.. వేలంపాట పెట్టినట్టుగా తాము అనౌన్స్ చేసిన పథకాలే బీఆర్ఎస్ మేనిఫెస్టోలో పొందుపరిచారన్నారు. డౌటేలేదు తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పుడున్న పరిస్థితి ప్రకారం 80 సీట్లు గెలుస్తామన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ పర్యటన కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపుతోందని తెలిపారు. ప్రియాంక మాటలు మహిళలకు భరోసా ఇచ్చేలా ఉన్నాయన్నారు. కాంగ్రెస్‌లో గ్రూపు విభేదాలు లేవని.. అందరం కలిసి పనిచేస్తామని కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ మాయ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దు : మంత్రి తలసాని



హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో యాభై ఏండ్లు అధికారంలో ఉండి ఏం చేసిందో చెప్పాలి. ఎన్నికలు వచ్చినప్పుడే కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ప్రజలు గుర్తుకొస్తారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు.

గురువారం సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని మొండా మార్కెట్ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మంత్రి ప్రచారానికి స్థానిక ప్రజలు మంగళహారతులు, డప్పు చప్పుళ్లు, బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ..గతంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదు.

50 సంవత్సరాల లో జరగని అభివృద్ధిని తొమ్మిదిన్నర సంవత్సరాలలో చేసి చూపెట్టామన్నారు. ప్రజల కష్టాల సుఖాల్లో పాలు పంచుకోని కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఎన్నికల సమయంలో మాయమాటలతో మన మధ్యకు వస్తున్నారు. అలాంటి వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దివ్యాంగుల పింఛన్‌పై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్: దివ్యాంగుల పింఛన్ పై మంత్రి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో జరుగుతున్న దివ్యాంగుల కృతజ్ఞత సభలో మంత్రి మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు రూ. 2 వందల పింఛన్ ఇస్తుందని.. అదే తెలంగాణలో రూ. 4,016 ఇస్తున్నామని చెప్పారు. అంటే 20 రెట్లు ఎక్కువన్నారు. ఇక్కడ అధికారంలోకి వస్తే దివ్యాంగులకు రూ. 4వేలు ఇస్తామంటే.. పక్కనున్న ఛత్తీస్‌గఢ్‌లో ఇవ్వకుండా తెలంగాణ రూ. 4వేలు ఇస్తామంటే ఎవరైనా నమ్ముతారా? అని ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సొంత రాష్ట్రం గుజరాత్ అని.. అక్కడ మరీ దారుణమని మంత్రి కేటీఆర్ విమర్శించారు. చిన్న రాష్ట్రం తెలంగాణలో 5,69,712 మంది దివ్యాంగులు ఉన్నారని గుర్తించామని, పెద్ద రాష్ట్రమైన గుజరాత్‌లో దివ్యాంగుల సంఖ్య 47,034 మంది మాత్రమే. మరి దీన్ని ఎలా అర్థం చేసుకోవాలన్నారు. అక్కడ కనీసం అంగవైకల్యాన్ని కూడా గుర్తించకుండా.. ఇంత దారుణంగా ఉందని విమర్శించారు. వారికి పింఛన్ ఎంత ఇస్తున్నారంటే.. అది కూడా అంగవైకల్యంబట్టి.. రూ. 6 వందల నుంచి వెయ్యి ఇస్తున్నారన్నారు. ఇక కర్నాట (%ఖుతీఅఖ్ఘుఖ్%) రాష్ట్రంలో 8,000,30 మంది దివ్యాంగులకు పింఛన్ ఇస్తున్నారన్నారు. అక్కడ ఇచ్చే పింఛన్ రూ. 11 వందలు మాత్రమే. ఇలా చెప్పాలంటే చాలా ఉన్నాయని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ బస్సుయాత్ర తుస్సుమనడం ఖాయమని, చీకటి పాలనకు చిరునామా కర్నాటక అని మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

విభజన హామీలపై ఎన్డీయేను ప్రశ్నించని రాహుల్‌కు.. తెలంగాణలో పర్యటించే అర్హత లేదన్నారు. కర్నాటకలో హామీలన్ని 100 రోజుల్లోనే బొంద పెట్టారన్నారు. అక్కడి రైతులకు 5 గంటలు కూడా కరెంట్ ఇవ్వడం లేదని, తెలంగాణకు నంబర్ వన్ విలన్ కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. ల్యాండ్ మాఫియాకు కేరాఫ్ టీపీసీసీ చీఫ్ అని, టిక్కెట్ల కోసం రూ. కోట్ల సొమ్ముతో పాటు.. భూములు రాయించుకుంటున్న రాబందు రేవంత్‌రెడ్డి అని, తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను ఎప్పటికి నమ్మరని మంత్రి కేటీఆర్ అన్నారు.

# రాహుల్ గాంధీపై మంత్రి నిరంజన్ రెడ్డి ఫైర్



హైదరాబాద్: కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీపై బీఆర్ఎస్ మంత్రి నిరంజన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. "కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీ నిన్న వచ్చి అసత్యపు మాటలు మాట్లాడారు. కాళేశ్వరం లక్ష కోట్ల అవినీతి అంటున్నారు. తక్కువ ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి ఎక్కడ జరిగింది. వాళ్ళది కుటుంబ పాలన కాదా.. కేసీఆర్ కుటుంబానిది మాత్రమే కుటుంబ పాలన. బో ఫోర్స్ స్కాం ఎవరి హయాంలో జరిగింది. ఎన్నో కుంభకోణాలు కాంగ్రెస్ హయాంలో జరగలేదా?. కుంభకోణాలతో జైళ్లకు వెళ్ళింది మీ పార్టీ కాదా?. రుణమాఫీపై అసలు వాస్తవం తెలియకుండా మాట్లాడారు రాహుల్ గాంధీ. రైతుల ఖాతాల్లో రుణాలు వేశాం.

అవగాహన లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడటం మంచిది కాదు. వచ్చిన పదివేల మందికి ఎగిరెగిరి పడుతున్నారు రాహుల్ గాంధీ. ఇచ్చిన గ్యారంటీలో ఏ ఒక్కటి కూడా కర్ణాటకలో అమలు కాలేదు. కరెంట్ కూడా ఇవ్వలేని పరిస్థితి ఉంది. అక్కడ సంక్షేమం సక్కగా లేదు." అని మంత్రి నిరంజన్ రెడ్డి విమర్శించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com